Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 104 మేడ్చల్ మల్కాజ్‌గిరి 6 మే 2023 శనివారం పేజీలు : 4

## బజరంగ్ దళ్ వివాదంతో కాంగ్రెస్‌కు కష్టాలు

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల వేళ బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని తమ మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఇక్కట్లు పడుతోంది. దీన్ని రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా రూపొందించిన బీజేపీ అన్ని ఆలయాల్లో హనుమాన్ చాలీసా పఠనాలు చేస్తోంది. బజరంగ్ దళ్ కూడా ప్రజలను చైతన్య పరుస్తూ భజన కార్యక్రమాలు, ఆందోళనలు చేపట్టింది. హనుమంతుడు పుట్టిన నేలపై బజరంగ్‌దళ్‌ను నిషేధించడమా అంటూ సంఘ్ పరివార్ కార్యకర్తలు ఆందోళనలు పతాకస్థాయికి తీసుకెళ్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నష్టనివారణ చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే ఈ అంశం ప్రకంపనలు సృష్టిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ యూ టర్న్ తీసుకుంది. బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని తమ మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ వెనకడుగు వేసింది.




# ఏపీ బాటలో తెలంగాణ

## "ఆహా! బంగారు తెలంగాణమా!"

## మన రాష్ట్రం కూడా అప్పులకుప్పలా మారనుందా..!?

**నాలుగు లక్షల కోట్ల అప్పు**
**నెలకు ఏడు వేల కోట్ల లోటు**
**వస్తున్న ఆదాయం 12 వేల కోట్లు**
**ఖర్చులు అన్నీ కలుపుకుంటే 19 వేల కోట్లు**
**ఏడాదికి లోటు 84 వేల కోట్లు ఓ లెక్కన**
**మూడేళ్లుగా లోటు 2 లక్షల 52 వేల కోట్లు**

హైదరాబాద్ : ఆదాయం ఘనం .. మిగులు నిధులు ఉన్న రాష్ట్రం.. మన కేసీఆర్ సర్ భాషలో చెప్పాలంటే గోడు మనదే గోస మనదే అన్న విధంగా ప్రత్యేక పాలన.. ప్రత్యేక రాష్ట్రం..బంగారు కలలు ఫలించి వచ్చిన బంగారు తెలంగాణ కానీ అంగట్లోన అన్నీ ఉన్నయ్ కానీ అప్పులు మాత్రం యథాతథంగా అదేవిధంగా ఉన్నాయి. ఏవీ కదలడం లేదు ఏవీ తేలడం లేదు కానీ అవసరం ఉన్నా లేకపోయినా కొత్త సచివాలయ నిర్మాణానికి సంబంధిత ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ కు మాత్రం ఆయన ఎక్కడ లేని శ్రద్ధ చూపించి నిధులు వెచ్చించి నిర్మిస్తుండడం విస్మయదాయకం అని విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. యాదాద్రి నిర్మాణానికి కూడా వెయ్యి కోట్లు దాటించి వెచ్చించిన దాఖలాలు ఉన్నాయి..

పోనీ అదొక టూరిజం వెంచర్ అనుకున్నా ఆశించిన రీతిలో రిజిస్ట్రేషన్ల పరంగా కానీ ఇతర రియల్ వెంచర్ల పరంగా కానీ ఆదాయం రావాలంటే మరికొంత సమయం పట్టడం ఖాయం. ఎలా చూసుకున్నా ఓ మెట్రో రైలుకు తక్కువలో తక్కువ ఐదు వందల కోట్ల రూపాయలను అప్పు రూపంలో కూడా సర్దడానికి ఇష్టపడని కేసీఆర్ ఎందుకని ఆడంబరాలకు పోతున్నారో తమకు అర్థం కావడం లేదని ఆర్థిక వేత్తలు ఆందోళన చెందుతున్నారు.

ఇది మూడేళ్ల లెక్క.. మరి ఎనిమిదేళ్లుగా ఇదే స్థాయిలో సమస్యలున్నాయా? లేదా ఇప్పటికిప్పుడు సమస్యలు పుట్టుకువచ్చాయా? తెచ్చిన అప్పులకూ వాటికి చెల్లించాల్సిన వడ్డీలకూ లెక్కలు తేల్చేసరికే తెలంగాణ సర్కారుకు ఉన్న సమయం సరిపోతుంది. ఇప్పటికే ఆసరా పెన్షన్లు సకాలంలో రావడం లేదని వాపోతున్నారు సంబంధిత లబ్ధిదారులు. ఔట్ సోర్సింగ్ మరియు కాంట్రాక్టు ఉద్యోగులకూ మూడు నెలలుగా జీతాల్లేవు. ఈ తరుణాన ఏపీ కన్నాఎక్కువ సంపద ఉన్న రాష్ట్రంలో ఈ అప్పుల తిప్పలేంటో ? ఏపీలో పెన్షన్ లు 61 లక్షలు.. తెలంగాణలో పెన్షన్ 36 లక్షలు.. ఏ విధంగా చూసుకున్నా కూడా సామాజిక పింఛన్ల వర్తింపులో కూడా ఏపీ యంత్రాంగం టీజీ కన్నా బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇస్తోంది. ఇవి ఎలా ఉన్నా.. ఇప్పుడు కొత్తగా ఆర్బీఐకు 15 వేల కోట్ల రూపాయల మేరకు రుణం కావాలి అని ప్రతిపాదనలను టీ సర్కారు పంపింది. ఇప్పటిదాకా చేసిన అప్పులకు చెల్లిస్తున్న వడ్డీల విలువే 1850 కోట్ల రూపాయలు అని తెలుస్తోంది. ఇది ఒక నెలకు అంటే ఏడాదికి 22200 కోట్లు కేవలం వడ్డీలకే చెల్లిస్తుందని తేలింది. పోనీ ఈ మూడేళ్ల లెక్క తీసుకున్నా అప్పు విలువ ఎంత ? వడ్డీ విలువ ఎంత అన్నది కూడా లెక్కలు తీస్తే కళ్లు బైర్లు కమ్మడం ఖాయం. 2018 డిసెంబర్ 13 నుంచి ఇప్పటిదాకా ఎన్నో సవాళ్లను కేసీఆర్ రెండో సారి ముఖ్యమంత్రి అయ్యాక చవి చూశారు లేదా ఎదుర్కొన్నారు. కనుక పూర్తైన మూడేళ్లకే లెక్కలు రాస్తున్నా కూడా అప్పుల తిప్పలపై ప్రభుత్వానికి అస్సలు బెంగే లేదు. అవి ఎలా తీరుతాయి అన్న బెంగ అస్సలు లేదు.. అని విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి.

# కర్నాటకకు కేసీయార్ దూరంగా ఉన్నది ఇందుకేనా ?





కర్నాటక ఎన్నికల్లో పోటీచేస్తుందని ప్రచారం చేస్తుందని బీఆర్ఎస్ విషయంలో జరిగిన ప్రచారమంతా ఉత్త ప్రచారంగా మాత్రమే మిగిలిపోయింది. కుమారస్వామి ఆధ్వర్యంలోని జేడీఎస్ కు బీఆర్ఎస్ మిత్రపక్షంగా ఉన్నది కాబట్టి పొత్తులో కొన్ని సీట్లకు పోటీచేస్తుందని అందరు అనుకున్నారు. అలాగే అన్నీ స్థానాల్లోను కేసీయార్ ప్రచారం చేస్తారని కూడా ముందు ప్రచారం జరిగింది. అయితే ఎన్నికల్లో పోటీచేయలేదు అలాగే ప్రచారమూ చేయలేదు. ఎందుకని జరిగిన ప్రచారానుండి కేసీయార్ యూటర్న్ తీసుకున్నారు ? ఎందుకంటే కర్నాటక ఎన్నికల్లో జేడీఎస్ గెలుపు అవకాశాలు లేవని మొదటినుండి ప్రీపోల్ సర్వేలు చెబుతున్నాయి. అలాగే కొన్ని సర్వేల్లో హంగ్ అసెంబ్లీ వచ్చే అవకాశముందని తేలింది. అలాగే మరికొన్ని సర్వేలు మాత్రం కాంగ్రెస్ పార్టీ కంఫర్టబుల్ మెజారిటితో అధికారంలోకి వస్తుందని చెప్పాయి. దాంతో అధికారంలోకి వచ్చే విషయంలో జేడీఎస్ విషయం తేలిపోయినా కాంగ్రెస్ విషయంపైనే కేసీయార్ కు అనుమానం వచ్చిందట. ఒకవేళ కొన్ని సర్వేల్లో తేలినట్లుగా కాంగ్రెస్ గనుక కంఫర్టబుల్ మెజారిటితో అధికారంలోకి వచ్చేస్తే ఎలాగన్న ఆలోచన మొదలైందట. మొదట్లో కేసీయార్ ఎన్డీయే యూపీఏ వ్యతిరేక స్టాండ్ తీసుకున్న తర్వాత మనసు మార్చుకున్నారు. ఇదివరకు లాగ కాంగ్రెస్ విషయంలో వ్యతిరేకత చూపటంలేదు. ఓవరాల్ సర్వేలు చూస్తే కేంద్రంలో అధికారంలోకి రాబోయేది మళ్ళీ ఎన్డీయేనే అన్న విషయం అర్ధమవుతోంది. ఈ సమయంలోనే అటు బీజేపీతోను ఇటు కాంగ్రెస్ తోను ఏకకాలంలో వైరంపెట్టుకుని తాను సాధించేది ఏమీలేదని కేసీయార్ కు అర్ధమైపోయింది. అందుకనే బీజేపీని దెబ్బకొట్టాలంటే పరోక్షంగా అయినా కాంగ్రెస్ కు సహకరించక తప్పని నిజాన్ని కేసీయార్ గ్రహించారు. ఇందులో భాగంగానే కర్నాటక ఎన్నికల్లో కేసీయార్ జోక్యం చేసుకోలేదు. కర్నాటకలో కాంగ్రెస్ గనుక అధికారంలోకి వస్తే పార్టీ జాతీయస్థాయిలో కూడా కొంచెం బలపడినట్లే లెక్క. అందుకనే జాతీయ రాజకీయాలు భవిష్యత్తులో ఎలాంటి మలుపులు తిరుగుతుందో తెలీదు కానీ కాంగ్రెస్ విషయంలో సాఫ్ట్ కార్నర్ చూపాల్సిన అవసరం వచ్చింది. అందుకనే కర్నాటక ఎన్నికల నుండి కేసీయార్ దూరంగా ఉండిపోయారు.

## సర్వేలన్నీ.. బీజేపీకే అనుకూలం: బండి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సమాజం ఇప్పుడు మార్పు కోరుతోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అధికారం అప్పగించేందుకు ప్రజలు రెడీగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం జరిగిన సర్వేలన్నీ కూడా.. బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. నవంబరు-డిసెంబరు మధ్య జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధిస్తామని బండి సంజయ్ తెలిపారు. ప్రధాని మోడీ మన్ కీ బాత్ కార్యక్రమం 100వ ఎపిసోడ్ బంజారాహిల్స్లో ప్రసారం చేశారు. దీనికి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ వందసార్లు రేడియో ద్వారా మనందరితో మాట్లాడిన గొప్ప వ్యక్తి అని తెలియజేశారు. ఇంత వరకు ఏ ప్రధాని.. మోడీ తరహాలో చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఎపిసోడ్లో ఏదో ఒక సమస్యపై ప్రజలతో చర్చించారని తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న సమస్యలపై ప్రధాని మాట్లాడారని చెప్పారు. మోడీ దేశంలో ఇన్ని గొప్ప పనులు చేస్తున్నా.. కొంత మంది రాజకీయ నాయకులు వారి స్వార్థం కోసం విమర్శిస్తున్నారని కేసీఆర్పై పరోక్షంగా బండి మండిపడ్డారు. ప్రధాని మాత్రం ఈ కార్యక్రమాన్ని రాజకీయం కోసం కాకుండా ప్రజల కోసం వినియోగించారని.. ఇందులో ఎటువంటి రాజకీయ కోణాలు తీసుకురాలేదని స్పష్టం చేశారు. మన్ కీ బాత్ ద్వారా ప్రజలను జాగృతం చేసి.. చైతన్యవంతులను చేశారని హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు అంటే కేసీఆర్ పట్టించుకోరని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తనకు నూతన సచివాలయం.. సచివాలయం మాదిరిగా కనిపించనందునే ప్రారంభోత్సవానికి వెళ్లలేదన్నారు. సర్వేలన్నీ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని చెబుతున్నాయని వెల్లడించారు. సర్వేలు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని.. కచ్చితంగా విజయం సాధిస్తామని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

# తెలంగాణాలోనే మకాం

## బీజేపీ టాప్ లీడర్స్ ఏం చేయబోతున్నారు..?



హైదరాబాద్ : తెలంగాణా కాశ్మీర్ యాపిల్ లా ఊరిస్తోంది. నోటి దాకా వచ్చినట్లే ఉంది. ఈ చాన్స్ అసలు వదులుకోవద్దు అని కూడా అనిపిస్తోంది. సౌత్ లో కర్నాటక తరువాత తెలంగాణావే చోటిచ్చేకరెక్ట్ ప్లేస్ అని కూడా కమలానికి అర్ధమవుతోందిట. అందుకే ఏకంగా తెలంగాణా నడిగొడ్డున హైదరాబాద్ వేదికగా సందడి చేసేందుకు బీజేపీ తయారైపోయింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలకు ఈసారి కూడా వేదిక చాలా ఇంటరెస్టింగ్ గా ఉంది. దాన్ని అలా ఎంపిక చేసుకున్నారు కమలనాధులు. ఆ వేదిక హైదరాబాదే అని అంటున్నారు కమల నాథులు. హైదరాబాద్ కి బీజేపీ మొత్తం టాప్ లీడర్స్ అంతా తొందరలో రానున్నారు. ఒకటి రెండు రోజులు కాదు ఏకంగా మూడు రోజుల పాటు అక్కడే మకాం వేయబోతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ హోం మంత్రి అమిత్ షా కేంద్ర మంత్రులు పార్టీ దిగ్గజ నాయకులు ప్రెసిడెంట్ జేపీ నడ్డా నాయకత్వాన హైదరాబాద్ లో చేరి భారత దేశాన రేపటి ఎన్నికల్లో జరిగే రాజకీయ సమరానికి అక్కడే చాణక్య వ్యూహాన్ని రచిస్తారుట. అలాగే త్వరలోనే తెలంగాణాలో ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి ఆరు నూరు అయినా కూడా గెలిచి తీరాలన్న పట్టుదల అయితే బీజేపీ కేంద్ర పెద్దలలో కనిపిస్తోంది. దానిలో భాగమే హైదరాబాద్ లో అంతా ల్యాండ్ అవుతున్నారు అని అంటున్నారు. బీజేపీ పెద్దల ఆలోచనలు ఎలా ఉన్నాయి అంటే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పుంజుకోలేదు కాబట్టి తెలంగాణా కాంగ్రెస్ కి కూడా హుషార్ ఉండే అవకాశం లేదు. ఇక రెండు సార్లు కేసీయార్ కి అవకాశం ఇచ్చిన ప్రజలు ఈ దఫా కచ్చితంగా మాజీని చేస్తారు అని కూడా అంచనాలు వేసుకుంటున్నారు. వరసగా కొన్ని ఉప ఎన్నికలతో పాటు హైదారాబాద్ లో జరిగిన కార్పోరేషన్ ఎన్నికల్లో విజయఢంకా మోగించిన బీజేపీకి ఇపుడు తెలంగాణాలో మంచి ఊపు ఉందని భావిస్తున్నారు. ప్రెసిడెంట్ బండి సంజయ్ చేసిన పాదయాత్రకు కూడా జనాలు బాగా వచ్చారని ఈ మధ్యనే జరిగిన అమిత్ షా సభ సూపర్ హిట్ అయిందని కూడా లెక్కలేసుకుంటున్నారు. దాంతో తెలంగాణా మీద ఫుల్ ఫోకస్ పెడితే కచ్చితంగా గెలుపు పిలుపు వినిపిస్తుందని కూడా బీజేపీ మాస్టర్ ప్లాన్ తో ఉందని అంటున్నారు. ఈ వ్యూహంలో భాగంగానే బీజేపీకి చెందిన అతిరథ మహారథులు అంతా హైదరాబాద్ వచ్చి మూడు రోజుల పాటు విడిది చేయబోతున్నారు అని తెలుస్తోంది. వచ్చే నెలలో ఈ సమావేశాలు జరిగే అవకాశముంది. హైదరాబాద్ లోని నోవటెల్ హొటల్ లో మూడు రోజుల పాటు జరిగే ఈ జాతీయ కార్యవర్గ సమావేశాలు దేశంలో బీజేపీ దశ దిశను నిర్దేశించడంతో పాటు తెలంగాణాలో అధికారం కోసం పక్కా స్కెచ్ గీస్తాయని అంటున్నారు. మొత్తానికి చూస్తే ప్రధాని మోడీ హోం మంత్రి అమిత్ షా మూడు రోజులు హైదరాబాద్ లో ఉంటారు అంటేనే ఒక విధంగా టీయారెస్ తో సమరానికి సై అన్నట్లుగానే భావించాలి. మరి బీజేపీ వేస్తున్న ఈ ఎత్తులు ఎంతవరకూ పారుతాయి. టీయారెస్ దీని మీద వేసే పై ఎత్తు ఎలా ఉంటుంది అన్నది కూడా చూడాలి.

## సంపాదకీయం

# థాయ్ లాండ్ లో జూదం ఆడితే వేసే శిక్షలు ఏంటి?

థాయ్ లాండ్.. అందునా పటాయా అన్నంతనే భారత్ లోని చాలామందికి చాలానే ఆలోచనలు వచ్చేస్తాయి. అక్కడ చేసే మసాజ్ లు.. నైట్ లైఫ్ గురించి కథలుకథలుగా చెబుతారు. అక్కడి నైట్ లైఫ్ లో వైల్డ్ ఎంజాయ్ మెంట్ కోసం భారత్ నుంచి పెద్ద ఎత్తున వెళుతుంటారు. నైట్ లైఫ్ లోని ప్లెజర్ కు అక్కడ అధికారికంగా అనుమతులు ఉంటాయి. దీంతో.. సరికొత్త సుఖాల కోసం పటాయాకు వెళుతుంటారు. థాయ్ లాండ్ వెళ్లే వారిలో అత్యధికులు సందర్శించేది పటాయానే. అలాంటి చోట.. క్యాసినో కు అనుమతి ఉంటుందని ఎవరైనా భావిస్తారు. గ్యాంబ్లింగ్ కు అనుమతులు ఉంటాయని భావిస్తారు. కానీ.. చాలామందికి తెలియని వాస్తవం ఏమంటే.. థాయ్ లాండ్ లో గ్యాంబ్లింగ్ నిషేధం. దీన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. అంతకు మించిన మరో విషయం ఏమంటే.. అక్కడి అధికారులకు లంచం ఇవ్వటాన్నిమహా నేరం. అక్కడి చట్టాలు సైతం లంచాన్ని తీవ్రమైన నేరంగా చూస్తాయి. ఈ కారణంతోనే థాయ్ లాండ్ మాజీ ప్రధాని సైతం అవినీతి ఆరోపణలు వచ్చినంతనే దేశం విడిచిపారిపోయి.. విదేశాల్లో తల దాచుకుంటున్నారు. ఏళ్లకు ఏళ్లుగా ఆయన సొంత దేశానికి తిరిగి వచ్చేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. దేశానికి ప్రధానిగా వ్యవహరించిన నేత పరిస్థితే ఇలా ఉంటే.. మిగిలిన వారి సంగతేంటి? అలా అని థాయ్ లాండ్ లో అస్సలు అవినీతి ఉండదని చెప్పట్లేదు. అదే నిజమైతే.. మాజీ ప్రధాని అవినీతి చేసే వారు కాదు కదా? అక్కడ లంచం ఉంది. కానీ.. లంచం ఇచ్చే నేరం చేస్తే మాత్రంశిక్షలు కఠినంగా ఉంటాయి. తాజాగా ప్రవీణ్ చీకోటి వ్యవహారాన్నే తీసుకుంటే.. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిని థాయ్ లాండ్ కు తీసుకెళ్లే క్రమంలో.. అక్కడ క్యాసినో చట్టబద్ధమూనని.. ఎలాంటి ఇబ్బంది ఉండదన్న మాట చెప్పి వారిని అక్కడకు తీసుకెళ్లారు. థాయ్ లాండ్ బోలెడంత పరపతి ఉందన్న బిల్డప్ ను నమ్మిన వారంతా దర్జాగా వెళ్లగా.. అక్కడ సీన్ మొత్తం మారిపోయింది. మరికొద్ది గంటల్లో హ్యాపీగా ఎయిర్ పోర్టుకు చేరుకోవాల్సిన వారంతా ఇప్పుడు జైల్లో ఉండాల్సిన దుస్థితి. ఇంతకూ థాయ్ లాండ్ చట్టాలు ఏమని చెబుతున్నాయి. గ్యాంబ్లింగ్ ఆడుతూ పట్టుబడితే విధించే శిక్షలు ఏమిటి? అన్నది ప్రశ్నగా మారింది. థాయ్ లాండ్ లోగ్యాంబ్లింగ్ మీద బ్యాన్ ఉంది. అయితే.. అందుకు భిన్నంగా గ్యాంబ్లింగ్ ఆడితే వారికి థాయ్ కరెన్సీ ప్రకారం 500 బాత్ (మనం రూపాయి అంటామో వారు తమ కరెన్సీని బాత్ గా వ్యవహరిస్తారు)ల నుంచి 5000 వేల బాత్ ల వరకు ఫైన్ వేస్తారు. మన రూపాయిల్లో ఒక్కో బాత్ విలువ 2.39లతో సమానం. ఈ లెక్కన 500 థాయ్ బాత్ లు అంటే రూ.1196.06. అదే 5000 థాయ్ బాత్ లు అంటే రూ.11960.55. ఫైన్ రూపంలో చూస్తే.. అందరూ చెల్లించే పరిస్థితే. ఇదేంపెద్ద కష్టం కాదు. కానీ.. జరిమానాతో పాటు ఏడాది జైలు విధించే వీలుంది. ఇక.. అన్నింటికంటే ఇబ్బంది కలిగించే అంశం ఏమంటే.. గ్యాంబ్లింగ్ ఆరోపణల మీద కేసు రిజిస్టర్ అయితే ఫర్లేదు కానీ.. అధికారులకు లంచం ఇచ్చిన ఆరోపణలతో కేసు ఉంటేనే మహా కష్టంగా చెబుతున్నారు. ప్రభుత్వ అధికారులకు లంచం ఇస్తే 20 ఏళ్ల వరకు జైలు శిక్ష.. భారీ జరిమానా విధిస్తారు. లంచానికి సంబంధించి కొన్ని సందర్భాల్లో తీవ్రమైన ఆరోపణలు ఉంటే మరణశిక్షను కూడా విధించే వీలుంది. మరి.. తాజాగా పట్టుబడిన చీకోటి అండ్ కో మీద ఏయే అంవాల మీద కేసులు నమోదు చేశారన్న దానిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# చెత్త కుప్పలు.. తప్పని తిప్పలు



గోదావరిఖని : రామగుండం నగరపాలికను కొన్ని నెలలుగా 'చెత్త' సమస్య వేధిస్తోంది.. 94 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 2.5 లక్షల జనాభా కల్గిన రామగుండం నగరపాలికకు ఇప్పటివరకు సొంతంగా డంపింగ్ యార్డు లేకపోవడంతో సమస్య తీవ్రరూపం దాలుస్తోంది. గత ఒకటిన్నర దశాబ్దాలుగా డంపింగ్ యార్డుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించాలంటూ ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ప్రయోజనం చేకూరడం లేదు. కొన్ని నెలల క్రితం వరకు జీడీకే 11ఎ బొగ్గు గని సమీపంలో సింగరేణి యాజమాన్యం నగరపాలిక డంపింగ్ యార్డు కోసం అనధికారికంగా స్థలాన్ని కేటాయించడంతో కొంత ఉపశమనం కల్గింది. తాజాగా ఆయా ప్రాంతంలో సింగరేణి ఉపరితల గని నిర్మాణం పనులు చేపట్టడంతో అక్కడికి చెత్త తరలింపును సింగరేణి అధికారులు అడ్డుకున్నారు. ఇక అప్పటి నుంచి బల్దియాకు చెత్త సమస్య మొదలైంది.

కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి

కొన్నేళ్లుగా డంపింగ్ యార్డుగా వినియోగించిన సింగరేణి స్థలంలో ఉపరితల గని నిర్మాణం పనులు మొదలు కావడంతో చెత్తవేసే పరిస్థితులు లేవు. ఆయా ప్రాంతాల్లో చెత్త వేయడాన్ని సింగరేణి అధికారులు వారిస్తున్నారు. ఇక చేసేది లేక నగరంలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడకు చెత్త తరలిస్తున్నారు. ప్రస్తుతం చెత్త సమస్య తీవ్రమైనప్పటికీ కొన్నేళ్లుగా రామగుండం నగరపాలికను ఈ సమస్య వేధిస్తూనే ఉంది. కొంతకాలం రామగుండం తహసీల్దారు కార్యాలయ సమీపంలోని ఎన్టీపీసీ ప్రహరీ పక్కనున్న ఖాళీ స్థలంలోకి రామగుండం పరిసర ప్రాంతాల్లోని చెత్తను తరలించగా ఎన్టీపీసీ యాజమాన్యం ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించడంతో అటుగా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. కొంతకాలం కుందనపల్లి సమీపంలోని ఖాళీ స్థలంలోకి చెత్తను తరలిస్తుండగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. తాజాగా సింగరేణి స్థలంలో చెత్త వేయడాన్ని సంస్థ అధికారులు నిరాకరించడంతో కొద్ది నెలలుగా మల్యాలపల్లి, లక్ష్మీపురం సమీపంలోని ఖాళీ స్థలాల్లో చెత్తను తరలిస్తూ వస్తున్నారు. మల్యాలపల్లి సమీపంలో చెత్త వేయడంతో మల్యాలపల్లితో పాటు పరిసర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్‌తో పాటు స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అటువైపు చెత్త ట్రాలీలు, ఆటోలు రాకుండా కందకం తవ్వించారు. దీంతో అటుగా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా గురువారం లక్ష్మీపురం, ఎల్కలపల్లిగేటు కాలనీ వాసులు, స్థానిక కార్పొరేటర్ నీల పద్మ చెత్త ట్రాక్టర్లు, ట్రాలీలను అడ్డుకున్నారు. దీంతో ఇకపై అటువైపు చెత్త తరలించే వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో సేకరించిన చెత్తను ఎక్కడకు తరలించాలో అర్థం కాక పారిశుధ్య విభాగం అధికారులు తల పట్టుకుంటున్నారు. గతంలో రామగుండం సమీపంలో డంపింగ్ యార్డు కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించినప్పటికీ స్థానికుల ఆందోళనలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. దీంతో చెత్త తరలింపును నిలిపివేసి అదే ప్రాంతంలో పట్టణ ప్రకృతి వనాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందిస్తేనే పరిష్కారం

గ్రామ గ్రామాన డంపింగ్ యార్డుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండగా రామగుండం నగరపాలికకు మాత్రం చెత్త సమస్య నుంచి విముక్తి కలగడం లేదు. డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలంటూ కొన్నేళ్లుగా ప్రభుత్వానికి నివేదిస్తుండడం, స్థలం కేటాయించాల్సిందిగా స్థానిక పరిశ్రమల యాజమాన్యాలకు వారు సూచించడం జరుగుతున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. రామగుండం నగరపాలిక ప్రాంతంలో అత్యధికంగా పరిశ్రమలకు సంబంధించిన స్థలాలే ఉండడంతో వారు స్పందిస్తే తప్ప రామగుండంలో చెత్త సమస్య తీరే పరిస్థితులు లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకాలంగా ఎలాగోలా నెట్టుకొచ్చినప్పటికీ ఇప్పుడు సమస్య తీవ్రరూపం దాలుస్తోంది. జిల్లా పాలనాధికారి, పురపాలక నిర్వహణ శాఖ, స్థానిక పరిశ్రమల యాజమాన్యాలు స్పందించి రామగుండం నగరపాలికలో చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.నగరపాలక పరిధిలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన డస్టుబిన్లలో చెత్త నిండుకుంది. కొన్ని రోజులుగా డస్టుబిన్ల నుంచి చెత్త తొలగించకపో వడంతో కాలనీవాసులు చెత్తను వాటి పక్కన కింద పోస్తున్నారు. దీంతో రహదారుల పక్కన, చుట్టూ పరిసరాల్లో చెత్త వ్యర్థాలు పడి దుర్వాసన వస్తోంది. పట్టణంలోని 1, 20, 21, 22వ డివిజన్లలో ఏర్పాటు చేసిన 10 డస్టుబిన్లు చెత్తతో నిండుకున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం...

– శ్యాంసుందర్, నగరపాలక పారిశుద్ధ్య పర్యవేక్షకులు

రామగుండంలో డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉంది. కొద్ది రోజులుగా చెత్త తరలింపు ఇబ్బందిగా ఉంది. విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయించాల్సిందిగా కమిషనర్ ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరారు. నగరపాలక అధికారులు, పాలకవర్గం తీవ్రంగా కృషి చేస్తున్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుంది.

# వానాకాలం పంటల ప్రణాళిక సిద్ధం



పెద్దపల్లి : ఈ ఏడాది వానాకాలం సీజన్‌కు పంటల ప్రణాళికపై జిల్లా వ్యవసాయ శాఖ సన్నద్ధమైంది. గతంలో ఎదురైన ఇబ్బందుల దృష్ట్యా పకడ్బందీగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో అవగాహన సమావేశం నిర్వహించగా క్షేత్ర స్థాయిలో ఏఈవోలు రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. జిల్లాలో ఎక్కువ సాగు భూములు గోదావరి, మానేరు పరీవాహక ప్రాంతాల్లో, ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో ఉండటంతో వరి సాగుకే రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుత యాసంగి ఆరంభంలో ధాన్యం సేకరణపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో చాలా మంది రైతులు సాగు చేయకుండా వదిలేశారు. తీరా పంట కోతల సమయంలో కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో సాగుకు దూరంగా ఉన్న రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వచ్చే వానాకాలంలో జిల్లాలో 2,86,755 ఎకరాల్లో పంటల సాగు అంచనాతో ప్రణాళిక రూపొందించారు. గతేడాది 2,86,163 ఎకరాలుండగా ఈసారి స్వల్పంగా విస్తీర్ణం పెరిగింది.

ఆధునిక సాగు పరిజ్ఞానంపై చైతన్యం

రైతులు మూస పద్ధతిలో పంటలు సాగు చేస్తుండటంతో తెగుళ్లు సోకి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. శాస్త్రీయ విధానంతో ఆధునిక పద్ధతిలో సాగు చేస్తూ, అధిక దిగుబడులు పొందేలా రైతుల్లో చైతన్యం నింపుతున్నారు. సాగు ఖర్చులు తగ్గించుకునేలా, మార్కెట్ అవసరాలు తీర్చుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ఏటికేడు డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతిలో వరి సాగు విస్తీర్ణం పెరగడంతో ఆ దిశగా రైతులను మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారు. సమగ్ర ఎరువుల యాజమాన్యం, జిల్లాలో నేలల స్వభావం, సమీకృత వ్యవసాయ విధానం, సేంద్రియ ఎరువుల వినియోగ ప్రయోజనాలను వివరిస్తున్నారు.

పెరిగిన పత్తి విస్తీర్ణం

జిల్లాలో గతేడాది 2,11,097 ఎకరాల్లో వరి సాగు చేయగా ఈసారి 1,93,200 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. పత్తి సాగు విస్తీర్ణం గతేడాది కంటే ఈసారి స్వల్పంగా పెరగనుంది. గత సంవత్సరం 63,279.39 ఎకరాల్లో సాగు చేయగా ఈసారి 81,270 ఎకరాల్లో సాగు చేయనున్నారు. పంటల సాగుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాల సరఫరాపై చర్చిస్తున్నారు. 30,435 మెట్రిక్ టన్నుల యూరియా, 5,710 మె.ట. డీఏపీ, 7,884 మె.ట. ఎంవోపీ, 21,763 మె.ట. కాంప్లెక్స్ కలిపి మొత్తం 65,793.05 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయి. జిల్లాలో రాయితీపై అందజేసే విత్తనాలు 14,937.8 క్వింటాళ్లు అవసరమవుతాయని అంచనా వేశారు. అలాగే వరి, పత్తి విత్తనాల సరఫరాలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

లాభసాటి పంటలపై అవగాహన కల్పిస్తున్నాం: ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారిజిల్లాలో వానాకాలం పంటల సాగుకు ప్రణాళిక రూపొందించాం. రైతులకు లాభసాటి పంటలపై అవగాహన కల్పిస్తున్నాం. చీడపీడలు, తెగుళ్ల నియంత్రణ చర్యలపై ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలిస్తాం. పెట్టుబడి వ్యయం తగ్గించి, అధిక దిగుబడి సాధించే పంటలపై రైతులు ఆలోచించాలి. విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో వ్యాపారి నుంచి కచ్చితంగా రసీదు తీసుకోవాలి.

# కేంద్రాల ప్రారంభం సరే... తూకాలేవి?

రుద్రంగి : రుద్రంగి మండల వ్యాప్తంగా ఇరవై రోజుల క్రితం యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ధాన్యంతో మార్కెట్ యార్డు నిండిపోయింది. మరోవైపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన అధికారులు తూకాలు ప్రారంభించలేదు. ఆకాశంలో కమ్ముకుంటున్న మబ్బులు, కురుస్తున్న చిరుజల్లులు ధాన్యం ఆరబోసిన రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కేంద్రాలకు తీసుకువచ్చి పదిహేను నుంచి ఇరవై రోజులు గడుస్తున్నా తూకం వేయకపోవడంతో అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు.గత సంవత్సరం యాసంగిలో మండలంలో సుమారు 3,500 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా సుమారు 1.5 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ యాసంగిలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు



చేసేది లేదని ప్రకటించటంతో సాగు విస్తీర్ణం తగ్గింది. ఈ ఏడాది యాసంగిలో కేవలం 2400 ఎకరాలకే పరిమితమైంది. గత ఏడాది ఏప్రిల్ చివరి వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా జూన్ చివరి వారం వరకు కొనసాగింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తొందరగా కొనుగోళ్లను చేపడితేనే జూన్ మొదటి వారం వరకు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. లేదంటే జూన్ చివరి వరకు కొనుగోళ్లు ప్రక్రియ సాగే అవకాశం ఉంటుంది. ఈ యాసంగిలో మండల వ్యాప్తంగా సుమారు 70 నుంచి 80 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా.

వీటిపై దృష్టిసారిస్తే మేలు ధాన్యం తూర్పార పట్టడానికి అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉంచాలి. ధాన్యం మిల్లులకు చేరుకున్న తర్వాత తరుగు పేరిట అదనంగా కోత విధించకుండా చూడాలి. లారీలు, గన్నీ సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. కొనుగోలు కేంద్రాల్లో విద్యుద్దీకరణ, తాగు నీరు, నీడ వసతులు ఏర్పాటు చేయాలి. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే రైతులకు అందిస్తే బాగుంటుంది.

తొందరగా కొనుగోళ్లు చేపట్టాలి : – ఇప్ప మహేశ్, రైతు, రుద్రంగి

నాకున్న నాలుగు ఎకరాల్లో సుమారు 120 క్వింటాళ్ల వరకు ధాన్యం పండించాను. ఆకాశంలో నిత్యం మేఘాలు ఏర్పతున్నందున ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించి వెంటనే తూకాలు వేయాలి. కాంటాలను పూర్తి చేసిన బస్తాలను జాప్యం చేయకుండా మిల్లులకు పంపిస్తేనే తర్వాత ధాన్యం తీసుకు వచ్చే రైతులకు స్థలం దొరుకుతుంది. గతంలో బస్తాలను మిల్లులకు పంపడంలో జాప్యం జరగటం వల్ల బస్తాలు కూడా తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

15 రోజుల కిందట తీసుకొచ్చాను : – లావుడ్య రవి, రైతు, రుద్రంగి

నాకు ఉన్న ఐదు ఎకరాలతో పాటు మరో 12 ఎకరాలను కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. పదిహేను రోజుల క్రితం ధాన్యాన్ని మార్కెట్ యార్డుకు తీసుకువచ్చాను. సుమారు 500 క్వింటాళ్ల ధాన్యాన్ని ఆరబెట్టుకోవటానికి నిత్యం 5 కి.మీ.ల దూరంలో ఉన్న కుక్కలగండి తండా నుంచి కుటుంబ సభ్యులతో కలిసి నిత్యం మార్కెట్ యార్డుకు వచ్చి ఆరబెట్టడం, మేఘాలను చూసి మళ్లీ కుప్పలు చేయాల్సి వస్తోంది.

మూడు, నాలుగు రోజుల్లో ప్రారంభిస్తాం : –శ్రీనివాసరావు, ఏఎంసీ ఛైర్మన్, రుద్రంగి

మూడు, నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తాం. సనుగుల ప్యాక్స్, రుద్రంగి ఏఎంసీలకు కేటాయించిన రైస్ మిల్లుల్లో ఎఫ్‌సీఐ తనిఖీలు జరుగుతున్నాయి. తనిఖీల ప్రక్రియ ముగిసిన తర్వాత కొనుగోళ్లను చేపడతాం.

# హద్దులు చెరిపేసి... ఆక్రమణలకు తెరతీసి...

సిరిసిల్ల : రాజరాజేశ్వర జలాశయం నిర్వాసితులకు ప్రభుత్వం పంపిణీ చేయగా మిగులు స్థలాల రక్షణను పూర్తిగా విస్మరించారు. అవి ఆక్రమణల పాలవుతున్నా వాటిని కాపాడే ప్రయత్నం చేయకపోవడం విచారకరం. నిర్వాసితులు పొందిన ప్లాట్లు, అందులో నిర్మించుకున్న ఇళ్ల నిర్మాణాల క్రయ, విక్రయాలకు అనుమతులిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇవి అమల్లోకి రావడానికి ఇంకా సమయం పడుతుంది. ఈ లోపు కాలనీల్లో పలుకుబడి కలిగిన వారు హద్దులు చెరిపేసి ఆక్రమణల పర్వానికి తెరతీశారు.రాజరాజేశ్వర జలాశయం నిర్మాణంలో బోయినపల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల పరిధిలోని 12 గ్రామాల్లో 11,731 మంది నిర్వాసితులను ప్రభుత్వం గుర్తించింది. వీరికి నివాస స్థలాలకు వేములవాడ, బోయినపల్లి, తంగళ్లపల్లి మండలాల పరిధిలో 11 కాలనీలకు 1,171.18 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను సేకరించారు. వీటిలో ఒక్కో నిర్వాసితునికి 242 చదరపు గజాల స్థలాన్ని పట్టాగా అందజేశారు. వీటితోపాటు పంచాయతీ, ఇతర ప్రభుత్వ భవనాలు, మౌలిక వసతులను కల్పించారు. కాగా చాలా కాలనీల్లో నిర్వాసితులకు పంపిణీ చేయగా మిగులు ప్లాట్లు, మరికొన్ని చోట్ల ప్లాట్లుగా చేయని ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో ఇవి అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. నీలోజిపల్లి, కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీల చుట్టూ హద్దులు సుమారు ఐదెకరాల పైనే ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఆక్రమణలకు గురయ్యాయి. ఇటీవల కాలనీవాసులు ఆక్రమణలను గుర్తించి ఫిర్యాదు చేయడంతో నిర్మాణాలను అడ్డుకున్నారు. కానీ ఇప్పటికీ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. అలాగే వేములవాడ మండలం పరిధిలోని రుద్రవరం, అనుపురం, కొడుముంజ కాలనీల సమీపంలో ప్రైవేటు వెంచర్లతో రిజిస్ట్రేషన్లు జరిగాయి. రెవెన్యూ అధికారులకు తెలిసినా వీటిని నిలువరించలేదు. ఇప్పటికీ చాలా కాలనీల్లో హద్దులు లేవు.

చర్యలు తీసుకుంటాం : – శ్రీనివాసరావు, ఆర్డీవో, సిరిసిల్ల

ఖాళీ ప్లాట్ల ఆక్రమణలు, కబ్జాలు ఆయా మండలాల పరిధిలోని రెవెన్యూశాఖ దృష్టిలో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ల అనుమతులకు ముందే పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలించి కాలనీల చుట్టూ హద్దులు ఏర్పాటుపై పరిశీలిస్తాం.

హద్దులు ఏర్పాటు చేస్తేనే...

నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్ల క్రయ, విక్రయాలకు గత నెల రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పట్టాలు పొంది, ఇళ్ల నిర్మాణం చేసుకున్నవారికి అవకాశం ఉంటుంది. నిర్వాసితులకు కేటాయించక ఖాళీగా ఉన్న ప్లాట్లు పూర్తిగా రెవెనూ ఆధీనంలోనే ఉంటాయి. రిజిస్ట్రేషన్ శాఖకు ఉత్తర్వులు పంపించే క్రమంలో కాలనీల వారీగా ఖాళీ ప్లాట్ల వివరాలు రిజిస్ట్రేషన్లకు అనుమతి లేకుండా చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో ఖాళీ ప్లాట్ల వివరాలు తెలుపుతూ ఇవి ప్రభుత్వ ఆధీనంలోని అని బోర్డులను ఏర్పాటు చేయాలి. వేములవాడ, బోయినపల్లి మండలాల పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు సిరిసిల్ల–కరీంనగర్ రహదారిని ఆనుకుని ఉన్నాయి. ఇక్కడ గజం స్థలం వేలల్లో పలుకుతోంది.

# 59 వేల ఎకరాల్లో పంట నష్టం

జగిత్యాల : మండుటెండల సమయంలో రోజుల తరబడి అకాల వర్షాలు కురుస్తూ అన్నదాతలను కుదురుకోనీయకుండా చేస్తున్నాయి. అన్నిరకాల పంటలు చేతికందే తరుణంలో వర్షం, ఈదురు గాలులు, వడగళ్లు విరుచుకుపడి జిల్లా రైతులకు తీరని నష్టాన్ని మిగులుస్తుండగా ధాన్యం సేకరణలో జాప్యం అన్నదాతలను మరింతగా వేధిస్తోంది. అకాల వర్షాలు వెన్నాడుతున్న తరుణంలో ధాన్యం సేకరణలో జాప్యం చాలా గ్రామాల రైతుల పాలిట శాపంగా మారింది. నిరుటికన్నా ఈ యాసంగిలో దాదాపుగా 15 రోజుల ముందుగానే జిల్లాలో ఏప్రిల్ మొదటివారంలోనే వరి నూర్పిడులు ఆరంభమయ్యాయి. ఇప్పటికీ ఆశించినట్లుగా సేకరణ జరగటంలేదు. ధాన్యం దిగుబడి, వరి నూర్పిడులను బట్టి కేంద్రాలను తెరవాల్సి ఉండగా కొన్నిచోట్ల నేతలకోసం ప్రారంభాన్ని వాయిదావేశారు. మరికొన్నిచోట్ల కేంద్రాలను ప్రారంభించిన తరువాత మిల్లుల కేటాయింపు, బస్తాల తరలింపును లారీల గుత్తేదారులకు అప్పగించటం, హమాలీలను కేటాయించటం, గన్నీలను తరలించటం తదితర పనులను చాలా నిదానంగా మొదలుపెట్టారు. వరి నూర్పిడులు ఆరంభమైన వెంటనే సేకరణ ప్రారంభిస్తే ఇప్పటికే చాలాగ్రామాల్లో పెద్దఎత్తున ధాన్యం మిల్లులకు తరలేది. కాగా సేకరణలో జాప్యం వేలాదిమంది రైతులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తోంది. కేంద్రాలన్నీ మట్టి కళ్లాలు కావటం, టార్పాలిన్లు తగినన్ని లేకపోవటం నష్టతీవ్రతను మరింతగా పెంచింది. ఇదే తరుణంలో మార్క్‌ఫెడ్ మొక్కజొన్నల సేకరణను ప్రారంభించకపోవటంతో మక్కలు సైతం వర్షాలకు తడుస్తుండగా పసుపు, కందులు తదితర ఉత్పత్తులు కూడా వర్షానికి తడిసి ముద్దవుతున్నాయి.

జిల్లాలో నూర్పిడి చేయాల్సిన పంటల్లో అకాలవర్షాలతో నష్టతీవ్రత



రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలోని 19 మండలాల్లోని 32,444 మంది రైతులకు చెందిన వరి, మక్క, నువ్వు, సజ్జ, మామిడి పంటలు 59,794.4 ఎకరాల్లో దెబ్బతిన్నాయని డీఏవో పి.సురేశ్‌కుమార్ తెలిపారు. ప్రాథమిక అంచనాను ప్రభుత్వానికి పంపించామని, రైతువారీగా సర్వేచేసి తుది నివేదికను పంపిస్తున్నామన్నారు. మామిడి కాయలు రాలటం, మార్కెట్లో అతి తక్కువగా ధర పలకటంతో జిల్లాలో మామిడికి రూ.90 కోట్లవరకు నష్టం వాటిల్లగా ఇతర పంటల్లోనూ మరో రూ.100 కోట్లకుపైగా పంటలను కోల్పోయారు. ప్రభుత్వం పంటలను కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ఇస్తామని పేర్కొన్నా ఎందరికి మంజూరు చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. పంట నష్టపోయిన మేరకు పరిహారం ఇవ్వాలని, ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని, మక్కల కొనుగోలును ప్రారంభించాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు.

ఏర్పాటు తలపెట్టిన కేంద్రాలు 419
ఇప్పటి వరకు ప్రారంభించినవి 360
కొనుగోలు ప్రారంభించినవి 25
వరిసాగు విస్తీర్ణం 2.98 లక్షల ఎకరాలు
ధాన్యం దిగుబడి అంచనా 5.32 లక్షల మెట్రిక్ టన్నులు
ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం 20వేల క్వింటాళ్ల వరకు

# ఎక్కడి నిర్మాణాలు అక్కడే!

కరీంనగర్ : ఎండాకాలంలో వర్షం దంచి కొడుతుండటంతో లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో వర్షం వస్తే చాలు.. కాలనీలు జలమయమవుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద ఉధృతికి కాల్వలు నిండి రోడ్లపైకి రావడం.. ఇళ్లల్లోకి వస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు స్మార్ట్‌సిటీలో ప్రాధాన్యమిచ్చి నిధులు కేటాయించారు. గతేడాది ఏప్రిల్‌లో పనులను ప్రారంభించగా వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంది. ఆలోగానే వర్షాలు పడుతుండటంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వానలు విరామం ఇవ్వగానే పనులు త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇటీవల కురిసిన వానతో బయటపడిన కొన్ని లోపాలతో కథనం.ప్రణాళిక ప్రకారం పూర్తి చేయకపోవడంతో..

గతంలో ఎక్కడైతే వరద రోడ్డెక్కిందో అక్కడే మళ్లీ రహదారులు నదులను తలపించాయి. ముకరంపుర, కలెక్టరేట్ రహదారి, జ్యోతినగర్‌లోని శివ థియేటర్ ఎస్‌బీఐ ఎదురుగా, కొత్త లేబర్ అడ్డా నుంచి సంతోషిమాత గుడి వైపు, మంకమ్మతోట హెచ్‌పీ పెట్రోల్‌బంకు ఎదురుగా, రాంనగర్ బస్టాపు సమీపంలో, కోతిరాంపూర్ ప్రధాన రహదారి, విద్యానగర్, శ్రీనగర్‌కాలనీ మాచర్ల గార్డెన్ దగ్గర, మంచిర్యాల చౌరస్తాలో, శర్మనగర్‌లో, అమేర్‌నగర్, హుస్సేనీపుర, అశోక్‌నగర్, కట్టరాంపూర్, తిరుమల్‌నగర్, కమాన్ ప్రాంతాల్లో ఎప్పటిలాగే వరద ప్రవహించింది. స్మార్ట్‌సిటీలో వరద కాల్వల పనులను పూర్తి చేయకపోవడంతో అక్కడి నుంచే వరద రోడ్ల మీదకు చేరింది. ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయకపోవడంతో సమస్యలు తప్పడం లేదు. కొన్ని చోట్ల ఇప్పటికీ పనులు ప్రారంభించకుండా వదిలేశారు. వర్షాకాలంలోగా సమస్యలు లేకుండా పూర్తి చేయాల్సిన అవసరముంది. లేదంటే ముంపు ముప్పు పునరావృతం కాక తప్పదు.ప్రభుత్వాసుపత్రి ఎదురుగా శర్మనగర్ మీదుగా ప్రవహించే వరద కాలువ పలు చోట్ల శిథిలమైంది. ఆదివారం కురిసిన వర్షానికి నీటి ప్రవాహం అధికమై ఖాళీ స్థలంలోకి వచ్చి వీధులన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరద చేరి స్థానికులు అవస్థలు పడ్డారు.హుస్సేనీపురలో ప్రధాన రహదారి పక్క నుంచి వెళ్లే వరద కాల్వ వర్షం పడితే చాలు పొంగి పొర్లుతుంది. స్మార్ట్‌సిటీలో నిర్మిస్తామని చెప్పి ప్రణాళికలు చేయగా ఇప్పటికీ అతీగతి లేకపోగా ఆ నీరంతా ఇళ్లల్లోకి వస్తోంది.సప్తగిరికాలనీ, శ్రీనగర్‌కాలనీ పూర్తిగా నీట మునిగింది. ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్ వైపు మీదుగా డ్రైనేజీ నిర్మించకపోవడంతో నీరంతా వెనక్కి వచ్చి రోడ్లపై పారుతుంది. ఈ వైపు పలు చోట్ల అసంపూర్తి కాల్వలు ఉన్నాయి. హౌసింగ్‌బోర్డుకాలనీలో ఎల్‌ఐజీ క్వార్టర్స్ వైపు బైపాసు రోడ్డు మీదుగా వరద ప్రవహించాల్సి ఉండగా హనుమాన్ గుడ్డి దగ్గర పనులు నిలిచి పోయాయి. భారీ వర్షం పడితే చాలు నీరంతా ఈ క్వార్టర్స్ వైపు ఉన్న నాలుగైదు ఇళు నీట మునుగుతున్నాయి.

పాతికేళ్ల నుంచి సమస్య..

శర్మనగర్‌లోని వరదకాల్వ పూర్తిగా కూలింది. పాతికేళ్ల నుంచి వరద వస్తూనే ఉంది. మరమ్మతులు చేయాలని పలుమార్లు వినతులు చేసినా పట్టించుకోవడం లేదు. వర్షానికి నీరంతా ఇళ్లలోకి వచ్చింది. బురద పేరుకుపోయింది.

# మట్టి మనిషికి పుట్టెడు కష్టం



ఖమ్మం : మట్టిమనిషికి పుట్టెడు కష్టమొచ్చింది. మండుటెండలు దంచికొట్టాల్సిన సమయంలో ముంచెత్తుతున్న వరుణుడు ఇకనైనా శాంతిస్తాడా అని వేయికళ్లతో ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది. ఉభయ జిల్లాల్లో అకాల వర్షాలు అన్నదాత పుట్టి ముంచుతున్నాయి. రూ.వేలకు వేలు పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని చేతికొచ్చిన పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వెళ్తే అక్కడా ధాన్యం రైతు చిత్తవుతున్నాడు. రోజుల తరబడి ఎదురుచూసినా నిబంధనల ప్రకారం తేమశాతం రాక.. పడిగాపులు కాస్తున్నాడు.

పంట తీసేందుకూ..ఈదురుగాలులతో కూడిన అకాలవర్షాలతో 15 రోజుల్లో చేతికందే మొక్కజొన్న తోటలు నేలవాలి రైతుల గుండెల్ని పిండేస్తున్నాయి. మొక్కజొన్న పైరులో నీరు చేరి కంకులు రంగు మారి మొలకెత్తుతున్నాయి. కిందపడిన కంకులను తీయడం అన్నదాతలకు భారంగా మారింది. ఒక్కో కర్రను పైకి లేపి కంకులు తీయాలంటే మిషన్లతో అయ్యే పనికాదు. సాధారణ సమయంలో రోజువారీగా కూలి రూ.250 చెల్లించేవారు. పెద్దఎత్తున పంటలు నేలవాలటంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. నేలవాలిన పంటలో మొక్కజొన్న తీసేందుకు ఒక్కో కూలీ రూ.400 అడుగుతున్నారు. ఎకరంలో మక్కలు తీసేందుకు సుమారు 15 మంది కూలీలు అవసరం. నేలవాలిన తోటల నుంచి మక్కలు తీయాలంటే ఒక్కో ఎకరాకు రైతుకు రూ.6వేలను అదనంగా భరించాలి. ధాన్యం రైతుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కోతలకు సిద్ధంగా ఉన్న వరి పైర్లు నేలవాలటంతో పంట కోయటం సవాల్‌గా మారింది. కోత యంత్రాలకు భారీ డిమాండ్ ఉండటంతో సాధారణ సమయంలో కన్నా రెట్టింపు ధరలు చెల్లించాల్సి వస్తుంది. కోతల సమయంలో వడ్లు రాలిపోయి దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు కేంద్రాలకు తెచ్చిన కర్షకుల పరిస్థితి మరింత కంటతడి పెట్టిస్తోంది.

ముదిగొండ మండలం వెంకటాపురానికి చెందిన కాంతారావు ఐదెకరాల్లో మొక్కజొన్న పండించారు. గత సీజన్‌లో పత్తి పంటను సాగుచేస్తే గులాబీ రంగు పురుగు సోకి పెట్టుబడులు పూడలేదు. ఈసారి మొక్కజొన్న సాగుతోనైనా నష్టాల నుంచి గట్టెక్కాలన్న ఉద్దేశంతో ఎకరాకు రూ.40 వేల చొప్పున వెచ్చించారు. చేతికొచ్చే దశలో మొక్కజొన్న పైరు అకాల వర్షానికి నేలవాలింది. మక్కలకు మొలకలు వస్తున్నాయని రైతు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

మామిడి రైతూ.. కుదేలు అకాల వర్షం.. గాలి దుమారంతో మామిడి రైతులు సైతం కుదేలయ్యారు. వరి, మొక్కజొన్న తదితర పంటలతోపాటు వందలాది ఎకరాల్లో సాగు చేసిన మామిడి తోటల్లో కాయలు సైతం పెద్ద ఎత్తున రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ సీజన్‌లో మూడుసార్లు వీచిన గాలిదుమారం.. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం గ్రామీణం, తిరుమలాయపాలెం మండలాల్లో తీరని నష్టాన్ని మిగిల్చింది.

ఆశాజనకంగా ఉందనుకుంటే..

గత మూడేళ్లతో పోలిస్తే.. ఈ ఏడాది మామిడి ఓ మోస్తారుగా, ఆశాజనకంగా కాయడంతో రైతులు కొంత సంతోషంగా ఉన్నారు. గాలి దుమారం రైతుల సంతోషాన్ని ఆవిరి చేసింది. మార్చి 17న, ఏప్రిల్ 21, 23, 30 తేదీల్లో కురిసిన వర్షాలు, గాలిదుమారంతో సుమారు 50 శాతం మేరకు మామిడి పంట రాలిపోయింది. కొద్దో గొప్పో ఆదాయం వస్తుందనుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఎదురైంది.

415 ఎకరాల్లో పంట నష్టం..పాలేరు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో మొత్తం 609 మంది రైతులు 2,234 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేశారు. అకాల వర్షాలు, గాలి దుమారంతో 133 మంది రైతులకు చెందిన 415 ఎకరాల్లో 50 శాతం మేరకు పంట నష్టం జరిగినట్లు ఉద్యానవన శాఖ అధికారులు అంచనా వేశారు.

తిరుమలాయపాలెం మండలం బంధంపల్లి గ్రామానికి చెందిన ముదిరెడ్డి మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు 24 ఎకరాల్లో మామిడి సాగు చేశారు. అధిక దిగుబడులు సాధించడానికి అనేక రకాలుగా సస్యరక్షణ చర్యలు తీసుకున్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉందనుకొని సంతోషంగా ఉన్న కుటుంబ సభ్యులకు గాలిదుమారం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. 50 శాతానికి పైగా కాయలు రాలిపోవడంతో రైతు కుటుంబం దిగాలు చెందింది. ఇదే పరిస్థితి నియోజకవర్గంలోని 133 మంది రైతులకూ ఎదురైంది.

ముదిగొండ మండలం వెంకటాపురానికి చెందిన రవీంద్రబాబు ఏడెకరాలను కౌలు తీసుకుని మొక్కజొన్న పండించారు. ఎకరాకు సుమారు రూ.40వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. 15 రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న తరుణంలో అకాల వర్షం విరుచుకుపడింది. మూడు, నాలుగుసార్లు ఈదురుగాలులతో కూడిన వానలతో పైరు నేలవాలింది. యంత్రాలతో తీసే పరిస్థితి లేదు. కూలీలతో కంకులు ఏరిద్దామంటే ఎకరాకు అదనంగా రూ.6వేలు వెచ్చించాల్సి వస్తుందని రైతు వాపోతున్నారు. తీసిన తర్వాతైనా పెట్టుబడులు పూడుతాయన్న నమ్మకం లేదని బోరున విలపిస్తున్నారు.ములకలపల్లికి చెందిన కంభంపాటి దుర్గాప్రసాద్ పదెకరాల్లో వరి సాగు చేశారు. మంగళవారం కురిసన వర్షంతో కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొన్ని రాసులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. సుమారు 100 బస్తాల ధాన్యం ఎందుకూ పనికిరాకుండా పోయింది. సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని రైతు కన్నీరుమున్నీరవుతున్నారు.వడగళ్ల వానతో గువ్వలగూడెంలో శ్రీనుకు చెందిన ఎకరం వరిపైరు నీటమునిగింది. పంటను కోయకుండానే వదిలేశారు. చేతికొచ్చిన 60 బస్తాల ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి 15 రోజుల క్రితం వచ్చారు. మూడుసార్లు వర్షం కురవటంతో ధాన్యం తడిసింది. రెండుసార్లు తేమశాతం పరీక్షలు నిర్వహించినా నిబంధనల ప్రకారం లేకపోవడంతో కాంటా కాలేదు. రాత్రనకా పగలనకా కేంద్రంలోనే పడిగాపులు కాయాల్సి వస్తోందని శ్రీను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రెండు నెలలుగా ఎదురుచూపులే..!



మహబూబాబాద్ : రెండో విడత కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు చేసినవారికి రీడింగ్ గ్లాసులు వెంటనే ఇస్తున్నారు. చూపు సమస్య తీవ్రంగా ఉన్నవారిని గుర్తించి అద్దాల తయారీదారులకు వివరాలు పంపిస్తున్నారు. రెండు నెలలు దాటినా ఇటువంటి వారికి కంటి అద్దాలు అందలేదు. ప్రభుత్వం పంపించే అద్దాల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. వంద రోజుల కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జనవరి 19న మంత్రి సత్యవతి రాథోడ్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శిబిరాన్ని ప్రారంభించారు. శని, ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో మాత్రం పరీక్షలు నిర్వహించడం లేదు. మొదటి విడతకు వచ్చిన స్పందన రెండో విడత శిబిరాలకు కనిపించడం లేదు. జూన్ 15 వరకు శిబిరాలను నిర్వహించాల్సి ఉండగా, కంటి పరీక్షలే తప్ప శస్త్ర చికిత్సలు లేకపోవడంతో ప్రజలు ముందుకు రావడం లేదు. దీంతో ఈ నెల చివరి వరకు ఈ ప్రక్రియ ముగించాలని అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఇస్తామన్న అద్దాలెప్పుడు వస్తాయోనని ఎదురు చూస్తున్నారు. వాటి కోసం నిరీక్షిస్తూ.. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల వద్దా అనే సందేహంతో ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు.

ప్రత్యేక శిబిరమైనా పంపిణీ చేయలేదు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో వివిధ వర్గాల వారికి కంటి పరీక్షలు చేసేందుకు ఫిబ్రవరి 16న ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న కొందరికీ రీడింగ్ గ్లాసులు అక్కడే పంపిణీ చేశారు. చూపు లోపం ఉన్నవారికి కంటి అద్దాలు సిఫారస్ చేశారు. ఆర్డర్ చేసి రెండు నెలలు దాటినా ఇంకా అద్దాలు రాలేదు.

నెల్లికుదురు మండల కేంద్రంలో పరీక్షలు చేయించుకుని నెల రోజులు దాటింది. అద్దాల కోసం ఎదురు చూస్తున్న పది మందికి పైగా ఇంకా అందలేదు. వస్తాయోరావోనని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షల్లో వారే అధికం

శిబిరాల్లో నేత్ర పరీక్షలు చేయించుకునేందుకు బీసీ, ఎస్టీలు అధికంగా వస్తున్నారు. నేటి వరకు బీసీలు 44.6 శాతం పరీక్షలు చేయించుకోగా, ఎస్టీలు 38.46, ఎస్సీలు 11.68, ఓసీలు 4.64, మైనార్టీలు 0.61 శాతం మంది మాత్రమే పరీక్షలు చేయించుకున్నారు. మహిళలు 51.14 శాతం కాగా పురుషులు 48.71, ట్రాన్స్‌జెండర్ 0.15 శాతం మంది ఈ శిబిరాల్లో పరీక్షలు చేసుకున్నారు.

వచ్చిన వెంటనే ఇస్తున్నాం..– డాక్టర్ అంబాల అంబరీష, జిల్లా నోడల్ అధికారి

స్వల్ప దృష్టి లోపమున్న వారికి సరిపడే రీడింగ్ అద్దాలు ఇస్తున్నాం. సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని గుర్తించి తయారీదారులకు ఆర్డర్ చేస్తున్నాం. అక్కడి నుంచి వచ్చిన వెంటనే బాధితులకు అందిస్తున్నాం. తయారీ సంస్థల వద్ద జాప్యం జరుగుతోంది.

# పెరిగిన వేతనం.. కార్మికుల్లో ఆనందం

మహబూబాబాద్ : సచివాలయం ప్రారంభోత్సవం.. మేడే సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారి వేతనాలను పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీ, పురపాలిక పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రూ.1,000 వేతనం పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో జిల్లాలోని పంచాయతీ, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది. సిబ్బందికి కొంత ఊరట కలుగనుంది. సర్కారు తీసుకున్న వేతనాల పెంపు నిర్ణయంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2103 మందిజిల్లా వ్యాప్తంగా 2103 మంది పారిశుద్ధ్య కార్మికులకు లబ్ధి చేకూరనుంది. 461 పంచాయతీల్లో 1732 మంది, నాలుగు మున్సిపాలిటీల్లో 371 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రస్తుతం నెలకు రూ.8,500 వేతనం వస్తుండగా, పెంచిన వేతనంతో రూ. 9,500 చేతికి అందనున్నాయి. పురపాలికలో రూ.15 వేలు ఇస్తుండగా, పెరిగినదానితో రూ.16 వేలు అందనున్నాయి.



జిల్లాలో పంచాయతీలు 461
పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య 1732

సంతోషంగా ఉంది

ధర్మారపు సుధాకర్, అమనగల్

పంచాయతీ సిబ్బంది వేతనాలు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేయడం సంతోషంగా ఉంది. ఇది కొంతవరకు కుటుంబానికి ఆసరాగా ఉపయోగపడుతుంది.

కొంతవరకు ఉపయోగం

లచ్చయ్య, దోర్నకల్

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. వేతనాలు పెంచడాన్ని స్వాగతిస్తున్నాం. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయి. ఇది కొంతవరకు ఉపశమనం.

# నిల్వలు లేక.. జిన్నింగ్ కాక

వేములవాడ : గతంలో ఎన్నడూ లేని విధంగా జిన్నింగ్ మిల్లులు ఈసారి నష్టాలను మూట గట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిల్లులకు పూర్తిస్థాయిలో పత్తి రాక అంతంత మాత్రంగానే జిన్నింగ్ సాగింది. జిల్లాలో వేములవాడ, కోనరావుపేట, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లో ఆరు జిన్నింగ్ మిల్లులున్నాయి. ఇందులో ఏ ఒక్క మిల్లుకు పూర్తి స్థాయిలో జిన్నింగ్ చేసేంత పత్తి నిల్వలు రాలేదు. దీంతో పనులు లేక మిల్లులు వెలవెలబోయాయి.జిల్లాలో ఈ సీజన్‌లో 69,200 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా మొత్తం 4.84 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. పత్తి సీజన్ ముగింపు దశకు వచ్చినప్పటికీ జిల్లాలో కేవలం 70,425 క్వింటాళ్ల పత్తిని మాత్రమే జిన్నింగ్ మిల్లులు, ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇక్కడి రైతుల వద్ద దళారులు పెద్ద ఎత్తున పత్తిని సేకరించి మహారాష్ట్ర, ఆదిలాబాద్, భైంసా ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లులకు తరలించారు. ఇక్కడి కంటే అక్కడి వ్యాపారులు క్వింటాల్‌కు రూ.200లకు పైగా అదనంగా ధర చెల్లించడంతో చాలా మంది దళారులు తరలించారు. ధర పెరుగుతుందనే ఆశతో చాలా మంది అన్నదాతలు పత్తి నిల్వలను ఇళ్లలోనే చాలా రోజులు నిల్వ చేసుకున్నారు. తీరా ధర పెరగకపోవడంతో దళారులకు విక్రయించారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున దళారులు రైతుల ఇళ్ల వద్దనే కాంటాలు పెట్టి



పత్తి కొనుగోలు చేయడంతో స్థానిక మిల్లులకు అంతంత మాత్రంగానే పత్తి వచ్చింది. జిన్నింగ్ మిల్లులకు పూర్తిస్థాయిలో నిల్వలు రాక వెలవెలబోయి మిల్లుల నిర్వహణ యజమానులకు భారమైంది. ఫలితంగా జిన్నింగ్ మిల్లులు నష్టాలను మూట కట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మిల్లు యజమాని ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటి దారి పట్టిన కూలీలు

జిన్నింగ్ మిల్లుల్లో పూర్తిస్థాయిలో పత్తి జిన్నింగ్‌కు రాకపోవడంతో అందులో పని చేసే కూలీలకు ఉపాధి లేక ఇంటి ముఖం పట్టారు. ఒక్కొక్క మిల్లులో పూర్తి స్థాయిలో జిన్నింగ్ పనులు జరుగుతాయనే అంచనాతో మిల్లుల యజమానులు దాదాపు 60 నుంచి 75 మంది కూలీలను పని కోసం రప్పించుకున్నారు. వీరంతా బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి మధ్యవర్తుల ద్వారా ఒప్పందం చేసుకొని వచ్చారు. తీరా ఇక్కడికి వచ్చిన తరవాత మిల్లులకు పూర్తిస్థాయిలో పత్తి నిల్వలు రాక చాలా మంది కూలీలకు పని లేకుండా పోయింది. దీంతో చేసేది లేక చాలా మంది ఇంటికి తిరుగు పయనమయ్యారు. ఈ ఏడాది పత్తి సీజన్ మొదలైనప్పటి నుంచి మిల్లులకు నిల్వలు అంతంత మాత్రంగానే రావడంతో కూలీలకు సరిపడా ఉపాధి లేకుండా పోయింది. వేములవాడ శివారు నాంపల్లి జిన్నింగ్ మిల్లులో ఏటా సీజన్ పూర్తయ్యే నాటికి దాదాపు 60 వేల నుంచి 80 వేల క్వింటాళ్ల పత్తిని జిన్నింగ్ చేసేవారు. అలాంటిది ఈ సీజన్‌లో కేవలం 20 వేల కింటాళ్లు మాత్రమే చేశారు. దీంతో చాలా మంది కూలీలు పని లేక ఇంటికి వెళ్లిపోయారు. జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లుల్లోనూ పెద్ద సంఖ్యలో కూలీలకు ఉపాధి కరవైంది. మరోవైపు మిల్లులకు పూర్తి స్థాయిలో పత్తి రాక నష్టాలే మిగిలాయి. గతంలో ఇలాంటి పరిస్థితి రాలేదుజిన్నింగ్ మిల్లులకు ఇలాంటి గడ్డు పరిస్థితి గతంలో ఎప్పుడూ రాలేదు. ఏటా దాదాపు 60 వేల నుంచి 80 వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి జిన్నింగ్ చేసేది. అలాంటిది ఈ సీజన్‌లో కేవలం 20 వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశాం. జిన్నింగ్‌కు సరిపడా పత్తి నిల్వలు లేక, పని లభించక చాలా మంది కూలీలు తిరిగి వెళ్లిపోయారు. ఈసారి చాలా మిల్లులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.ఆరోగ్యరెడ్డి, మిల్లు నిర్వాహకుడు, వేములవాడ

# ఇంకుడుగుంతలతో జలసంరక్షణ

జగిత్యాల : గతంలో వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటి తీవ్ర కరవు పరిస్థితులను ఎదుర్కొనడంతో ప్రభుత్వం ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టుకోవాలని ఆదేశించింది. కొంత కాలంగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో ఇంకుడు గుంతల నిర్మాణాలపై దృష్టి సారించడం తగ్గించారు. అధికారులు విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించి, నిర్దేశించిన లక్ష్యం చేరుకోవడంలేదు. ఫలితంగా ఏటా వృథా నీటిని అడ్డుకోకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి కరవు పరిస్థితులు నెలకొంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రజల్లో కొంత అవగాహన పెరిగి దృష్టి సారించినప్పటికీ కొన్నేళ్లుగా ప్రభుత్వం అందించే ప్రోత్సాహక డబ్బులు సకాలంలో చెల్లింపులు కాకపోవడంతో నిర్మాణాలపై లబ్ధిదారులు నిరాసక్తత చూపుతున్నారు. జిల్లాలోని 380 పంచాయతీల పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం 1,01,735 ఇళ్లకు గానూ 44,941 పూర్తిచేసినట్లు గుర్తించారు. మిగతా నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినా పూర్తి చేయలేకపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ ప్రాంతాల్లో 1781 నిర్మాణాలు చేపట్టాలని గుర్తించగా ఇందులో 802 ప్రాంతాల్లో పూర్తిచేయగా, మిగతా ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

నిరుపయోగమే!

గతంలో నిర్మించుకున్న ఇంకుడుగుంతలు వర్షపు నీటిని మళ్లించే చర్యలు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. లక్ష్యం కోసం నిర్మించి వదిలేయడంతో వృథాగా నీటికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ ప్రాంతాల్లో మురుగు నీరు మళ్లించడం ద్వారా భూగర్భ జలాలు పెరగడమే కాకుండా పరిశుభ్రంగా ఉండే అవకాశముంది. ఇందుకు నిర్మాణాలే కాకుండా వినియోగంలోకి వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

అవగాహన కల్పిస్తున్నాం

లక్ష్మీనారాయణ, డీఆర్డీవో

ఇంటింటా ఇంకుడు గుంత నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించాం. ఇప్పటికే గ్రామాల్లో సెర్ప్, ఈజీఎస్ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించి నిర్మాణాలు చేపడుతున్నారు. వర్షాకాలంలోపు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళిక తయారు చేశాం. ప్రస్తుతం నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

# వీధి కుక్క.. పెరుగుతున్న లెక్క!

మహబూబాబాద్ :ఓరుగల్లు నగరంలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. నగరవాసులకు ఐదారు నెలలుగా నిత్యం కుక్క కాట్లు తప్పడం లేదు. ఇటీవల రెడ్డికాలనీలో ఒకటే రెండున్నర గంటల్లో 36 మందిపై దాడికి తెగబడడం పరిస్థితి తీవ్రతను చెబుతోంది. ఈ క్రమంలో పిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్డు మీదకు రావడానికి భయపడుతున్నారు.

ఎక్కువగా సంచరించే ప్రాంతాలు

నగరంలోని రామన్నపేట పెద్దమోరీ, పాపయ్యపేట, ఓఎస్‌నగర్, రఘునాథ్ కాలనీ, పోతననగర్, రంగంపేట, కొత్తవాడ, దేశాయిపేట, ఎల్బీనగర్, కాశీబుగ్గ, లేబర్ కాలనీ, అబ్బనికుంట, గిర్మాజిపేట, మట్టెవాడ, ఖిలావరంగల్ కోట, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట, శాంతినగర్, పెరుకవాడ, శివనగర్ ప్రాంతాల్లో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయి.

తిమ్మాపూర్, మామునూరు, వసంతపూర్, దూపకుంట, బొల్లికుంట, సింగారం, నక్కలపల్లి, రాంగోపాలపూర్, ధర్మారం, గొర్రెకుంట, ఆరెపల్లి, పైడిపల్లి విలీన గ్రామాల్లో కుక్క కాట్లు తప్పడం లేదు.

రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్, శివనగర్, సీకేఎం ఆసుపత్రి గల్లీ, ఎల్లమ్మబజారు, మండిబజారు, దేశాయిపేట, పాపయ్యపేట ప్రాంతాల్లోని చికెన్ దుకాణాల వద్ద ఎక్కువగా పోగవుతున్నాయి.

మాంసం వ్యర్థాలతోనే..



వీధి కుక్కలు పెరగడానికి చాలా కారణాలున్నాయని నిపుణులు తేల్చారు. విచ్చల విడిగా మాంసం, చికెన్ వ్యర్థాలు, రెస్టారెంట్లు, హోటళ్లలో మిగిలిపోయిన ఆహారాన్ని పడేస్తుండటంతో వాటికి సరిపడా ఆహారం లభిస్తోంది.. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో చికెన్, మటన్ వ్యాపారులు వ్యర్థాలను డ్రైనేజీల్లో పడేస్తున్నారు. అమ్మకాల దుకాణాల ముందు పెద్ద సంఖ్యలో గుంపులు సంచరిస్తున్నాయి. విలీన గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో మిగిలిన ఆహారాన్ని డంపర్, కంపాక్టర్ బిన్లు, రహదారుల్లో డంపు చేస్తున్నారు. ఇలాంటి దగ్గర అవి ఎక్కువగా తిరుగుతున్నాయి.

చికెన్, మటన్ వ్యర్థాలు, ఆహారాన్ని బయట వేయకుండా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

మీకు తెలుసా..వరంగల్ నగరంలోని 66 డివిజన్లలో 19 వేల వీధి కుక్కలున్నాయని ప్రజారోగ్య విభాగం పరిశీలనలో తేలింది. ఇందులో 7 వేల కుక్కలు చర్మ వ్యాధుల బారిన పడినట్లుగా గుర్తించారు.

ఇదీ పరిస్థితి..జంతు సంరక్షణ చట్టం ప్రకారం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స ద్వారా వీధి కుక్కల సంతానోత్పత్తిని నిలువరించాలని పురపాలక శాఖ ఉత్తర్వులు చెబుతున్నాయి. ఈ క్రమంలో నగరంలో వాటిని పట్టుకునేందుకు మూడు బృందాలు, 12 మంది సిబ్బంది, మూడు వాహనాలున్నాయి. ఐదేళ్లుగా గ్రేటర్ పరిధిలో వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. చింతగట్టు ఎస్సారెస్పీ క్యాంపులో ఆపరేషన్ థియేటర్, డాగ్స్ వెయిటింగ్ హాల్ ఉంది. ఇప్పటి వరకు 10 వేల కుక్కలకు శస్త్ర చికిత్స చేసినట్లుగా లెక్కలు చెబుతున్నాయి. చింతగట్టు ఆపరేషన్ థియేటర్‌లో ప్రస్తుతం రోజూ సగటున 30 శునకాలకు శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఈ లెక్కన నెలకు 900, ఏడాదికి 10 వేలు వరకు కు.ని చికిత్సలు చేస్తున్నారు. 66 డివిజన్లలో ఇంకా శస్త్రచికిత్స చేయని 9 వేల కుక్కలకు ఈ లెక్కన కు.ని. చికిత్స పూర్తవ్వాలంటే మరో ఐదేళ్ల సమయం పడుతుందని అంచనా. ఈ సమయంలో వీధి కుక్కలు వందల సంఖ్యలో పిల్లలను కంటాయి.. వాటి పరిస్థితి ఏమిటనేది అర్థం కాని విషయం.

నిపుణుల సలహాలు పాటిస్తాం–డాక్టర్ రాజేష్, ముఖ్యఆరోగ్యాధికారి

గ్రేటర్ వరంగల్‌వీధి కుక్కల నివారణ చర్యలు వేగవంతం చేశాం. చర్మ వ్యాధులున్న కుక్కలను పట్టుకొని ఐదు దఫాలుగా డోస్‌లు ఇస్తాం. కు.ని. ఆపరేషన్లు పెంచేందుకు ఆలోచన చేస్తున్నాం. చికెన్, మటన్ వ్యర్థాలు, ఆహార పదార్థాలు బయట పడేయకుండా వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తాం. నిపుణుల కమిటీ సలహాలు అమలు చేస్తాం.ఫిర్యాదు చేయొచ్చు.. బల్దియా టోల్ ఫ్రీ నంబరు 1800 425 1980చింతగట్టు డాగ్ హౌజ్ ఇన్‌ఛార్జి భాషానాయక్ సెల్ నంబరు 7893863204బల్దియా పశువైద్యాధికారి డాక్టర్ గోపాల్‌రావు, 9701999701ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజేష్, 9701999689

# ఆదాయమంతా జీతభత్యాలకే!

మల్యాల : జిల్లాలో ధాన్యం దిగుబడులు విపరీతంగా పెరగడంతో ఏటా ఐకేపీ, సింగిల్విండోల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు ద్వారా సమకూరే కమీషన్ ఆదాయం కార్యాలయాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలకే ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో 51 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలుండగా వాటిలో కొన్ని సింగిల్విండోలు మాత్రమే ధాన్యం కొనుగోలు ద్వారా లాభాల బాటలో పయనిస్తుండగా మిగిలినవాటి ఆదాయమంతా జీతభత్యాలకే ఖర్చవుతున్నాయి. మల్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా దాని పరిధిలోని ఐదు గ్రామాల్లో ఏటా దాదాపు లక్ష క్వింటాళ్లకుపైగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు రూ.32 చొప్పున దాదాపు రూ.35 లక్షల ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ ప్రతి సంవత్సరం కార్యాలయంలో పనిచేసే సీఈవో, కంప్యూటర్ ఆపరేటర్, క్లర్కు, సేల్స్ మేనేజరు వేతనాలకు రూ.10 లక్షలు, ఏటా రెండు సీజన్లలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది, నిర్వహణ ఖర్చుల కింద రూ.12.50 లక్షల ఖర్చు చేస్తున్నారు.సింగిల్విండో ద్వారా రైతులకు ఎరువులు, వరి విత్తనాలు విక్రయిస్తున్నా పెద్దగా లాభాలు పొందడంలేదు. మల్యాల సింగిల్విండో పరిధిలో కొండగట్టు, మల్యాల అడ్డరోడ్డు, బల్వంతాపూర్, సర్వాపూర్, మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 2010 నుంచి ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళు ప్రారంభించింది. ఐదేళ్ల నుంచి ధాన్యం దిగుమతి విపరీతంగా పెరగడంతో ఒక్కో సింగిల్విండోకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. సిబ్బంది వేతనాలకే 90 శాతం నిధులు వెచ్చిస్తుండగా మిగిలిన డబ్బులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పాలకవర్గాలు పేర్కొంటున్నాయి. మల్యాలలోని సింగిల్విండో ఖాతాలో ప్రస్తుతం రూ.22 లక్షలు మాత్రమే ఉన్నాయని, వాటితో నూతనంగా రూ.40 లక్షల అంచనా వ్యయంతో లాకర్ గది సౌకర్యంతో కార్యాలయ భవన నిర్మాణం చేపట్టినట్లు సీఈవో గోవర్ధన్ తెలిపారు. ఏటా తమ సింగిల్విండోలో రూ.10 కోట్ల టర్నోవర్ ఉంటుందని వివరించారు.

# రోడ్ల నిర్మాణం.. వైవిధ్యభరితం



ఖమ్మం : ఆదివాసీల అవస్థల ప్రయాణానికి తెరపడనుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల మంజూరుచేసిన నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధులతో అధునాతన పద్ధతుల్లో బీటీ రహదారులు ఏర్పాటుకానున్నాయి. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వీటికి అనుమతులు లభించాయి. గుత్తేదారులు వారంలో పనులు ప్రారంభించేలా ఆర్అండ్‌బీ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

జిల్లాలో బీటీ రోడ్లు మంజూరైన ప్రాంతాలు పినపాక మండలం భూపతిరావుపేట నుంచి వలస ఆదివాసీ గ్రామం సుందరయ్యనగర్‌కు రూ.2 కోట్లతో రెండు కి.మీ. రహదారి నిర్మించనున్నారు.

చర్ల మండలం రామానుజపురం నుంచి గోదావరి నది వరకు 2 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.2కోట్లు, సుందరయ్యనగర్ నుంచి వీరాపురం కాలనీ వరకు 2.5 కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. ఆళ్లపల్లి మండలంలో ప్రధాన రహదారి నుంచి రాఘవపురం వరకు, దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం నుంచి లక్ష్మీపురం వరకు రూ.20 కోట్లతో సుమారు 20 కి.మీ. రోడ్డును ఏర్పాటు చేయనున్నారు.

అధునాతన పద్ధతుల్లో.. పినపాక మండలం భూపతిరావుపేట నుంచి సుందరయ్యనగర్ వరకు రహదారి నిర్మాణానికి ప్రత్యేక పద్ధతులు అవలంబిస్తున్నారు. ముందుగా రహదారిపై 70 శాతం గ్రావెల్, 30 శాతం జీఎస్పీ మిశ్రమాన్ని పరుస్తారు. మొదటి దశలో భాగంగా ఒక క్యూబిక్ మీటరు మిశ్రమానికి 40 కిలోల సిమెంట్‌ను కలుపుతారు. ఈ మిశ్రమం అంతా కలిసేలా రోటావేటర్‌తో చదును చేస్తారు. రెండోదశలో ఒక క్యూబిక్ మీటరు గ్రావెల్, జీఎస్పీ మిశ్రమానికి 60 కిలోల సిమెంటు కలిపి చదును చేస్తారు. మూడో దశలో బీటీ పోయటంతో రహదారి నిర్మాణం పూర్తవుతుంది.

దుమ్ముగూడెం మండలంలో సుమారు 20 కి.మీ. రహదారి నిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాల మిశ్రమాన్ని వినియోగించనున్నారు. రహదారి మన్నిక ఏళ్ల తరబడి చెక్కు చెదరకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఆళ్లపల్లి, చర్ల మండలాల్లో ప్రత్యేక రసాయనం (టెర్రాజైం)తో బీటీ రోడ్లు నిర్మించనున్నారు. ఈ రహదారుల మన్నిక చాలాకాలం ఉంటుంది.

ప్రత్యేక ప్రమాణాలు పాటిస్తూ బీటీ రహదారులు నిర్మించటం జిల్లాలో ఇదే మొదటిసారి. గతంలో ఏర్పాటు చేసిన వాటికి భిన్నంగా ఈరోడ్లు ఉంటాయి.రాంబాబు,ఏఈ, ఆర్అండ్‌బీ

# ఏమరుపాటు.. ప్రాణాలకు చేటు



ఖమ్మం :విద్యుత్తు తీగ మృత్యుపాశమవుతోంది. క్షణకాల నిర్లక్ష్యంతో ఎంతోమంది ప్రాణాలు బలిగొంటోంది. మరెందరో వైకల్యం బారిన పడుతున్నారు. తెగి పడిన తీగలు, పంటలను కాపాడేందుకు పెట్టే రక్షణ కంచెలు, వ్యవసాయ విద్యుత్తు మోటార్లు, నియంత్రికల ఎర్తులు వంటివి ఉసురు తీస్తున్నాయి. అకాల వర్షాల కారణంగా జిల్లాలో ఇటీవల పలు సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. విద్యుత్తు ప్రమాదాలపై సిబ్బందిని, ప్రజలను చైతన్య పరిచేందుకు విద్యుత్తు శాఖ ఏటా మే ఒకటి నుంచి వారం రోజులపాటు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 11 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో సుమారు 1.6 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. జోరుగా గాలి వీచినప్పుడు, వర్షాకాలంలో తీగలు తెగడం, పంటకు రక్షణగా కంచెకు విద్యుత్తు పెట్టడం, జంతువులను, చేపలను వేటాడేందుకు ఏర్పాటు చేసిన తీగలు తగిలినప్పుడు ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ఉప కేంద్రాల్లో అరకొరగా సిబ్బంది ఉండటంతో వేలాడే, తెగిన విద్యుత్తు తీగలను గుర్తించడం ఆలస్యమవుతోంది.పరిహారం పొందొచ్చు...విద్యుత్తు ప్రమాదాలతో మృతి చెందిన కుటుంబాలకు సంస్థ పరిహారం అందిస్తుంది. అయితే ఘటన ఆ శాఖ నిర్లక్ష్యం వల్ల జరిగిందని తేలితేనే పరిహారం మంజూరవుతుంది. వ్యక్తి మృతి చెందితే రూ.5 లక్షలు, పశువులకు రూ.40 వేలు, గొర్రెలు, మేకలకు కూడా పరిహారం అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు స్టేషన్‌లో, విద్యుత్తు శాఖ అధికారులకు తెలియజేయాలి. ఎఫ్ఐఆర్, పంచనామా ధ్రువీకరణ పత్రాలను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలి.

జాగ్రత్తలు... విద్యుత్తు సరఫరా చేసే పరికరాలను అమర్చుకోవడంలో నిర్లక్ష్యం వహించకూడదు. ప్లాస్టిక్ స్టార్టర్ బాక్సులు ఏర్పాటు చేసుకోవాలి. ఎర్తింగ్ తప్పనిసరి.

వర్షాలు పడినప్పుడు తెగిపడిన విద్యుత్తు తీగలు, విరిగిన స్తంభాలను ముట్టుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని గుర్తించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలి.

వేలాడుతున్న తీగల గురించి అధికారులకు తెలియజేయాలి.

అనుమతి లేకుండా నియంత్రికల పైకి ఎక్కి తీగలు సరి చేయడం, మరమ్మతు చేయడం, సర్వీసు వైర్లు మార్చకూడదు.

వ్యవసాయ పంపుసెట్ల వద్ద సర్వీసు, ఎర్త్ వైర్లు మంచి నాణ్యమైన ఇన్సులేషన్ ఉన్నవి వినియోగించాలి. పొలం కంచెకు స్టే వైర్లు, ఎర్త్ వైర్లు తగలకుండా చూసుకోవాలి.

ఫ్యూజులు, స్టార్టర్ బోర్డులు నేలకు 5 అడుగుల ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేయాలి.

ఫ్యూజు కాలిపోతే నేరుగా కనెక్షను ఇవ్వకూడదు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కొత్త ఫ్యూజు అమర్చుకోవాలి.

దుస్తులు ఆరేసేందుకు ఉపయోగించే దండెంగా తాడును, ఇన్సులేషన్ ఉన్న తీగను ఉపయోగించాలి. విద్యుత్తు తీగలకు దగ్గరగా కట్టకూడదు.

ఎవరికైనా విద్యుదాఘాతం తగిలితే రక్షించాలనే ఆతృతతో ముట్టుకోవద్దు. విద్యుత్తు సరఫరాను నిలిపివేయాలి.

పంట పొలాల రక్షణ కంచెలకు విద్యుత్తు కనెక్షను ఇవ్వవద్దు. సోలార్ ఫెన్సింగ్ ఉపయోగించుకోవచ్చు.

ఏడాది కాలంలో జరిగిన ప్రమాదాలు

ఖమ్మంలో.... 30 మంది వ్యక్తులు, 153 పశువులు

భద్రాద్రి కొత్తగూడెంలో...32 మంది వ్యక్తులు, 102 పశువులు మృత్యువాత పడ్డాయి. మరెందరో గాయాలపాలయ్యారు.

మధిరలో వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో కొణతం రామచంద్రరావు(59), కంభం అనిల్(21) మృతి చెందారు.

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల నివారణ

నిర్లక్ష్యం, అవగాహన లేమితోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రజలను, రైతులను చైతన్య పరిచేందుకు ఏటా మే మొదటి వారంలో భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే అనేక ప్రమాదాలను నివారించి, ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఏదైనా ఘటనను గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలి.

ఎ.సురేందర్, ఎస్ఈ, ఖమ్మం

సమాచారం ఇద్దాం... తెగిన, వేలాడే విద్యుత్తు తీగలు, ప్రమాదాలు గుర్తించిన వెంటనే టోల్ ఫ్రీ నెంబరు: 1800 425 0028, హెల్ప్‌లైన్ 1912కు సమాచారం అందించాలి.


# ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి

ఖమ్మం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో దశాబ్దాల నుంచి పనిచేస్తున్న ఉద్యోగుల క్రమబద్ధీకరణ, హెచ్ఆర్ పాలసీ అమలు ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. ఈ మేరకు ఖమ్మం డీసీసీబీలో నిర్వహించిన డీఎల్ఈసీ(డిస్ట్రిక్ట్ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీ)లో ఆమోదముద్ర పడింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తీర్మానించారు. ఈడీసీసీబీ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోని 100 పీఏసీఎస్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీవో–44 ప్రకారం అర్హత ఉన్న వారిని గుర్తించి ఉత్తర్వులు వెలువరించారు.

ఏప్రిల్ నెల నుంచే కొత్త వేతనాలురెగ్యులర్ అయిన వారికి వేతనాలను సవరించారు. ప్రతి ఉద్యోగికి నిర్దేశించిన ప్రకారం పే స్కేల్ వర్తింపజేశారు. ఏప్రిల్ 1 నుంచే కొత్త వేతనాలు చెల్లిస్తారు. ఇందుకోసం ప్రతి సహకార సంఘంలో 'మార్జిన్ మనీ' ఖాతాలు తెరవనున్నారు. ఇక నుంచి ఈ ఖాతాల్లో జమచేసిన నిధుల ద్వారానే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తారు. గతంలో ప్రతి బ్రాంచి మేనేజర్ మూడు నెలలకోసారి సంఘాలను తనిఖీ చేసేవారు. ఇక నుంచి ప్రతి నెలా పరిశీలించాల్సి ఉంటుంది. గతంలో సహకార సంఘాల్లో పనిచేసి సస్పెన్షన్‌కు గురైనవారు, దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినవారు, మధ్యలో ఉద్యోగాలు మానేసి తిరిగొచ్చి చేరిన వారి గురించి డీఎల్ఈసీ సమావేశంలో చర్చించారు. ఖమ్మం జిల్లాలో 20 మంది, భద్రాద్రి జిల్లాలో ఇద్దరు ఉన్నారు. వీరికి సంబంధించి 'స్టేటస్‌కో' అమలుచేయాలని నిర్ణయించారు.

కారుణ్య నియామకాలకు పచ్చజెండా..

కారుణ్య నియామకాలకు సంబంధించిన వారు ఖమ్మం జిల్లాలో ఐదుగురు, భద్రాద్రి జిల్లాలో ముగ్గురు ఉన్నారు. నిబంధనల ప్రకారం



వీరి ఉద్యోగాలను క్రమబద్ధీకరించే విషయమై సమావేశంతో సానుకూలంగా తీర్మానించారు. రికవరీ ఉన్న వారి జాబితాను పెండింగులో ఉంచారు. గతంలో క్రమశిక్షణ చర్యలకు గురై రివర్షన్ అయిన ఉద్యోగులకు.. ప్రస్తుతం వారు పనిచేస్తున్న క్యాడర్‌లోనే పే ఫిక్సేషన్ చేశారు.

డీఎల్ఈసీ, డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఖమ్మం డీసీవో ఎ.విజయకుమారి, డీసీసీబీ సీఈవో, డీఎల్ఈసీ సభ్యుడు అట్లూరి వీరబాబు, నాబార్డు డీడీఎం సుజిత్‌కుమార్, ప్యాక్స్ హెచ్ఆర్‌డీ సలహాదారు నర్సింహారెడ్డి, టెస్కాబ్ ఏజీఎం వివేక్, డీఎల్ఈసీ విభాగం ఇన్‌ఛార్జి, డీసీసీబీ జీఎం పద్మావతి, భద్రాద్రి కొత్తగూడెం డీసీవో వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

# తడిసిన ధాన్యం.. ఉప్పుతో ఉపకారం!

ములుగు : ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ముమ్మరమై.. కొనుగోలు కేంద్రాలు ధాన్యంతో పోటెత్తుతున్న సమయంలోనే అకాల వర్షాలు అడ్డుపడ్డాయి. కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దవ్వడం.. పొల్లాలోని వరి నేలవాలడంతో కర్షకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ధాన్యం మొలకెత్తకుండా పలు విధాలా ప్రయత్నిస్తున్నారు. తడిసిన వడ్లు రంగు మారకుండా, మొలకలు రాకుండా 'ఉప్పు' ఉపకారిగా పనిచేస్తుందని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వారి సూచనలను పాటిస్తూ.. ధైర్యంగా ఉందాం..ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా యాసంగిలో సాగైన వరి: 6,48,090 ఎకరాలు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 70 శాతం, మహబూబా బాద్ 45, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో 50 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. జనగామ జిల్లాలో వడగళ్లతో చాలా చోట్ల పంట చేతికిరాకుండా నేలరాలింది. ఇక్కడ 30 శాతం కోతలే పూర్తయ్యాయి.

ఊహించని నష్టం...వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మార్చి నుంచి ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో 1.20 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కురిసిన వాన వల్ల 15 లక్షల క్వింటాళ్ల ధాన్యం కల్లాల్లో తడిసి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. నీళ్లలో కొట్టుకుపోయింది ఎక్కువగానే ఉంది. వాటికి లెక్కలు లేవు. ఆరు జిల్లాల్లో లక్ష ఎకరాలకు పైగా పొలాల్లో ధాన్యం నేలరాలింది.

ఈ జాగ్రత్తలు తీసుకుందాం.. కుప్పలుగా పోసిన ధాన్యాన్ని పలుచగా నేలపై చల్లినట్లు ఆరబోయాలి. ఎప్పటికప్పుడు కలియదిప్పడంతో పాటు గాలి అందేలా చూడాలి. తడిసినవి, రంగుమారిన గింజలను మంచి ధాన్యంతో కలపకూడదు. వేర్వేరుగా ఉంచితే ఎక్కువ నష్టం జరగదు. తడవకుండా ఉండేందుకు కుప్పను ప్రత్యేకమైన పద్ధతిలో కాపాడేలా టార్పాలిన్లు కప్పాలి. వరద పక్కనుంచి వెళ్లేలా పాదులు తీయాలి.

మార్చిలో కోతకు వచ్చేలా..యాసంగి వరి సాగు చేసేవారు మార్చిలో కోతకు వచ్చేలా నాట్లు వేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. జనవరి 26 వరకు నాట్లు వేస్తే సరిపోతుంది. చాలా మంది ఫిబ్రవరి మొదటి వారంలో నాట్లు వేయడం వల్ల కోతలు అనుకున్న సమయానికి రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అకాల వర్షాలు తోడుకావడంతో అన్నదాతలు నష్టపోయారు.వర్షపాతం ఇలా.... గతేడాది (2022) జూన్ 1 నుంచి ఈ ఏడాది మే 2వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,002.5 మి.మీల సగటు వర్షపాతం నమోదు కావాలి. 1,585.83 మిల్లీమీటర్లు కురిసింది.

# మావోయిస్టుల కదలికలపై నిఘా

ములుగు : మావోయిస్టు కదలికలపై డేగకన్ను వేయాలని రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఐజీ ప్రభాకర్‌రావు ఆదేశించినట్లు తెలిసింది. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన వెంకటాపురం పోలీస్ సర్కిల్ కేంద్రంలో ఆయన రహస్యంగా పర్యటించారు. ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నక్సల్స్ కదలికలపై ఆరా తీసినట్లు సమాచారం. ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం అనంతరం ఇక్కడ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కీలకమైన ఈ ప్రాంతంలో పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

రెండు జిల్లాల అధికారులతో సమీక్ష

భౌగోళికంగా మావోయిస్టుల కదలికలు, రాకపోకలకు అనుకూలంగా ఉన్న ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ సర్కిల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీస్ సర్కిల్ పరిధిలోని దండకారణ్యంపై నిశిత శోధన చేపట్టాలని ఉన్నత స్థాయి అధికారులు సూచించినట్లు తెలిసింది. ములుగు ఎస్పీ గాష్ ఆలం, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ వినీత్, భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్‌లతో పాటు సీఆర్పీఎఫ్, ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులతో ఇక్కడ రహస్య సమావేశం అయ్యారు. తనిఖీలు నిర్వహించి తిరుగుముఖం పట్టిన జవాన్లను మావోయిస్టులు మట్టుబెట్టిన



తీరు, దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత క్రమంలో తీసుకోవాల్సిన రక్షణ, భద్రత చర్యలపై కీలకాంశాలను చర్చించినట్లు తెలుస్తోంది. కట్టుదిట్టమైన భద్రతతో శత్రువును తుదముట్టించేందుకు ప్రణాళికలు చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

దండకారణ్యంలోకి అడుగు పెట్టకుండా..

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా, దంతెవాడ, బీజాపూర్ జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతాన్ని అక్కడి సీఆర్పీఎఫ్, డీఆర్జీ, ఏఎస్టీఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్ బృందాలు జల్లెడ పడుతున్న క్రమంలో మావోయిస్టులు తెలంగాణ అరణ్యంలోకి ప్రవేశించే అవకాశాలు ఉన్నట్లు ఉన్నత స్థాయి సమీక్షలో పోలీసు అధికారులు ఓ నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అక్కడ కూంబింగ్ ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో దండకారణ్యంలోకి మావోయిస్టులు అడుగులు పెట్టకుండా కట్టుదిట్టమైన నిఘాను పెంచాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మావోయిస్టులు ఏ ప్రాంతానికి వచ్చినా ఎదుర్కొనేలా సంసిద్ధం కావాలని సూచించినట్లు తెలిసింది.

అంతా గోప్యంగానే..

శాంతిభద్రతల పరిరక్షణకు గాను చేపట్టిన ఉన్నత స్థాయి సమీక్షను పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచారు. ఎవరు పర్యటించారు? సమీక్షకు సంబంధించిన విషయాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. డ్రోన్ ఆపరేషన్ ప్రాంతానికి వెళ్లేందుకు మీడియా ప్రయత్నించినా పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం, పర్యటనకు సంబంధించి కనీస ప్రకటన సైతం జారీ చేయకపోవడం గమనార్హం.

డ్రోన్‌తో అన్వేషణఉన్నతస్థాయి సమీక్ష నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా నిఘా పెంచారు. వెంకటాపురం–వాజేడు మార్గంలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. సీఆర్పీఎఫ్, ప్రత్యేక పోలీసు బలగాలతో గస్తీ తిరిగారు. పట్టణ శివారులోని ఓ మైదాన ప్రాంతంలో డ్రోన్ ఆపరేషన్ చేపట్టారు. సాంకేతికత సాయంతో సరిహద్దు దండకారణ్యంలో సర్వే చేశారు. మావోయిస్టుల కదలికలు ఉండే గుట్టల ప్రాంతాన్ని డ్రోన్ ద్వారా పరిశీలించారు. ఆయా చిత్రాలను సైతం సమీక్ష సమావేశంలో ప్రదర్శించి చర్చించినట్లు తెలుస్తోంది.

# పత్తి.. కొత్త ఒరవడి!

ఖమ్మం : సహజంగా పత్తిలో మూడు, నాలుగుసార్లు దూదిపంటను తీయాల్సి ఉంటుంది. కానీ కూలీల కొరతతో రైతులు తగిన రీతిలో పత్తిని సేకరించలేకపోతున్నారు. కొన్ని సందర్భాల్లో చివరిదశ పత్తిని తీసేందుకు కూలీలు దొరక్క పంటను వదిలేస్తున్నారు. దీంతో పూర్తిస్థాయిలో దిగుబడిని అందుకోలేకపోతున్నారు. దీన్ని గమనించిన వ్యవసాయ శాఖ అధికారులు.. రైతులు ఒకే కోతతో పత్తి పంట పొందేలా కొత్త వంగడాలు అందుబాటులోకి తేవాలని జయశంకర్ విశ్వవిద్యాలయానికి గతంలో సూచించారు. ఈమేరకు నాగపూర్‌లోని జాతీయ పత్తి పరిశోధన సంస్థ ఇచ్చిన నాలుగు వంగడాలు, నూజివీడు విత్తన సంస్థ తయారుచేసిన మరో మూడు వంగడాలతో గతేడాది వరంగల్‌లో ప్రయోగాత్మకంగా పత్తిసాగు చేపట్టారు. ఈ వానాకాలంలో ఖమ్మం జిల్లాలోనూ రైతులతో ఈ పంటను సాగు చేయించేందుకు వ్యవసాయ శాఖ ప్రయత్నిస్తోంది. ఇందుకు వీలుగా ఉన్న విత్తనాల సమకూర్పు, అన్నదాతలకు



అవగాహన కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రస్తుత సాధారణ సాగు విధానంలో ఎకరానికి 6వేల నుంచి 7 వేల విత్తనాలు నాటుతున్నారు. రెండు విత్తన ప్యాకెట్లు వాడుతున్నారు. ఒక్కో ప్యాకెట్‌లో 450 గ్రాముల విత్తనాలు ఉంటాయి. రెంటిండి ధర రూ. 1550 అవుతోంది. కానీ వర్సిటీ శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా ఒకే కోత వంగడాలను ఎకరానికి 16వేల నుంచి 20వేల వరకు విత్తారు. ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ సీజనలో ఎకరానికి 16,500 నాటారు. ఒక్కో మొక్కకు 20కి తగ్గకుండా కాయలు వచ్చాయని, ఒక్కో కాయపగిలి కనీసం 4గ్రాముల దూది వస్తుంది అంచనా వేశారు. ఈ లెక్కన 16,500పత్తి మొక్కల నుంచి కనీసం 13నుంచి 15 క్వింటాళ్ల దూదిని ఒకే సారి తీయొచ్చని వ్యవసాయ వర్సిటీ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ జగదీశ్వర్ తెలిపారు. ఈ విధానం మీద ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి, వ్యవసాయ అధికారికి కలిసి దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు.

రైతులకు లాభం చేకూర్చేందుకు పరిశోధనలువిజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారిఅన్నదాతకు అధిక దిగుబడి వచ్చేలా ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. ఈనేపథ్యంలోనే ఒకే సారి సేకరించే విధంగా పత్తి వంగడాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రయోగాత్మకంగా ఈ వానాకాలం జిల్లాలో సాగు చేయించాలనుకుంటున్నాం. ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

# కూరగాయాలు!

ఆదిలాబాద్ : నిత్యవసర సరుకులు కొనలంటే సామాన్యుడికి దడపుడుతుంది. పా లకుల నిర్లక్ష్యం కారణంతోనే ధరలు విపరీతంగా పెరిగాయనే ఆరోపణలున్నాయి. కొద్ది నెలలుగా నిత్యవససర ధరలు నిప్పులు కక్కుతున్నా యి. రెండు నెలల్లో ఎంత తేడా.. ఒక వస్తువుతో మరొకటి పోటీ పడు తూ సగటు జీవి నడ్డివిరుస్తున్నాయి. నింగినంటిన ధరలు సామాన్యుల పాలిట శాపమయ్యాయి. నూనె ధరలు కాగుతున్నా యి, టమాట రెటు వింటే నోట మాట రావడంలేదు. టమాట, దొండ, బీర, బెండ, ఒక్కటేమి టి దేనిని కొనాలన్న భయమేస్తుంది. ఇక పప్పుల సంగతి చెప్పనవసరం లేదు. నూనెలైతే సలసల మరుగుతున్నాయి. దీంతో ఇంట్లో రోజు ఉండే మెనూ చిన్నబోతుంది. అంతేకాకుండా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు మార్కెట్‌లోని త్యావసరధరలు చూస్తే మధ్యతరగతి మానవుడి మైండ్ బ్లాక్ అవుతుంది. సామాన్యుడి బతుకుభారం అవుతున్నవేళ.. ధరల పోటు వచ్చినవేళ... నేడు నిత్యవ సర ధరలు చుక్కలం టాయి. సామా న్యుడికి ఎల్ల వేలలో అందుబా టులో ఉండే కూరగాయలు. నిత్యవసర సరుకుల ధరలు అందనంత దూరం ఉన్నాయి. ప్రజలు నిత్యం వాడుకునే టమాటలు, ఆకుకూరలు, ఎల్లిగడ్డలు, పప్పుదినుసులు. నూనె, బియ్యం తదిరర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. దీంతో సామాన్యుడికి ఇబ్బందులు తప్పడం లేదు.కొండెక్కిన పప్పుదినుసులు... పప్పుదినుసుల సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో మార్కెట్‌లో వీటి ధర పెరిగిపోయింది. కంది కిలో రూ.110. పెసర, మినప కిలో రూ.110 నుంచి రూ.120 శనగ పప్పు కిలో రూ. 60-70 పెరిగాయి. అలాగే బియ్యం దొడ్డు రకం క్వింటాల్‌కు రూ.1600-1800ధర పలుకగా, సన్నరకం బియ్యం క్వింటాల్‌కు రూ.4000-4500 వరకు పలుకుతుంది. నూనె నాసిరకం కిలోకు రూ. 200 పలుకగా, నాణ్యత కల్గిన రకం నూనె కిలో రూ.250-260 వరకు లభ్యమవుతుంది. లీటర్ నాసిరకం రూ.170, నాణ్యత కల్గిన నూనె లీటరు రూ 195 పలుకుతుంది. ఏది ఏమైనా



?ధరల పెరుగుదలతో సామాన్యుడికి ఇబ్బంది ఎదురవుతుంది. పెరిగిన ధరలు..మార్కెట్‌లో ఆకుకూరకట్టలను కొనలంటే ఇబ్బందులు తప్పడంలేదు. మెంతి కట్ట ఒకటి రూ. 20, కొత్తిమీర కిలో రూ.110, పుదీనా రూ.15, పాలకూర రూ.5 పలుకుంది. వీటి సా గు తక్కువ ఉండడంతో మార్కెట్‌లో డిమాండ్ ఉంది. కాయకూరగాయలలో రారాజు పెరున్న వంకాయ కిలో రూ. 50-.60, బీర రూ.100-120, టమాట కిలో రూ.80, బెండ రూ.50 కాకర రూ.80, దొండ రూ.60, క్యారెట్ రూ.80, చిక్కుడు కిలో రూ.100 పచ్చిమిర్చి కిలో రూ. 80, క్యాలిప్లవర్ కిలో రూ. 100, ఎల్లిగడ్డలు కిలో రూ. 50, ఉల్లి గడ్డలు రూ. 20, అల్లం రూ. 60 విక్రయిస్తున్నారు.నియంత్రణపై చొరవ చూపని సర్కార్..ధరలు ఆకాశనంటుతున్న నియంత్రణ చర్యలు ఎ క్కడా కానరావడం లేదని సర్వత్రా ఆరోపణాలు వినిపిస్తున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా మారి కొందరు స రుకులను బ్లాక్‌చేసి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణాలు వినిపిస్తున్నాయి, సంబంధిత శాఖ అధికారులు స్పందించక పోవడంతోనే ధరలు పెరుగుతున్నయని, దీంతో సామాన్య ప్రజలు ఇ బ్బందులు పడుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

# బడిపై బాధ్యతేదీ?



ఖమ్మం : కొత్త విద్యాసంత్సరం ప్రారంభం కాబోతోంది. వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి బడి తలుపులు తెరుచుకోనున్నాయి. ఈ క్రమంలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం బడిబాటను ప్రారంభించింది. సర్కారు బడుల్లో చేరికలను పెంచేలా కార్యాచరణ ప్రకటించింది. కానీ అధికారుల పర్యవేక్షణ లోపం, తమ బాధ్యతను మరవడం, స్కూళ్లలో సరైన వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు విద్యాసంస్థల్లో చేర్చేందుకే మొగ్గుచూపుతున్నారు. 'మన ఊరు మనబడి', 'మన బస్తీ మన బడి' కార్యక్రమాలతో పాఠశాలలను ఆధునికీకరిస్తున్నా, ఇంగ్లీష్ మీడియంలో బోధన ప్రవేశపెడుతున్నా.. అధికారులు సర్కారు విద్యపై విద్యార్థుల తల్లిదండ్రులకు పూర్తి స్థాయిలో నమ్మకం కల్పించేలేకపోతున్నారని, బడు విషయంలో తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చివరకు పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలుకూడా ప్రైవేటు విద్యవైపే ఆసక్తిచూపుతున్నారు.

ఎన్నో లోపాలు, కారణాలు.. పాఠశాలల నిర్వహణ బాధ్యతలను సక్రమంగా నిర్వహించకపోవడం, సమయం పాటించకపోవడం, ఉపాధ్యాయులు స్థానికంగా ఉండకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించడం, తూతూ మంత్రంగా విద్యాబోధన చేస్తుండటం, మరుగుదొడ్లు, తరగతిగదులు, తాగునీరు లాంటి వసతులు సక్రమంగా లేకపోవడం లాంటి కారణాలతో తల్లిదండ్రులు పిల్లలను సర్కారు పాఠశాలలకు పంపేందుకు వెనకాడుతున్నట్టు తెలుస్తోంది. ఎంపికచేసిన పాఠశాలల్లో నిరంతరం నీటిసరఫరా, విద్యుదీకరణ, తాగునీరు, ఫర్నిచర్, పాఠశాలల్లో ఆకర్షణీయంగా రంగులు, గోడలపై చిత్రాలు వేయించడం, మరమ్మతులు, ఆకుపచ్చ రాత బోర్డులు, ప్రహరీల నిర్మాణం, వంటగది, భోజనశాలల ఏర్పాటు, డిజిటల్ సౌకర్యాలు, శిథిల భవనాల స్థానంలో కొత్తదవి నిర్మించడం లాంటి 12 ప్రాధన్యాత అంశాలను మన ఊరు మనబడిలో పొందుపరిచారు. కానీ ఇది కార్యచరణకే పరిమితమవుతోంది. వసతులు ఎన్ని ఉన్నా ఉపాధ్యాయులు విధి నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారుతోంది.

బయోమెట్రిక్‌పై ఉపాధ్యాయుల అనాసక్తి పాఠశాలలకు మరమ్మతులు, ఆధునికీకరణ చేపడుతున్నా బయోమెట్రిక్ విధానాన్ని మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో అమల్లోకి తేవడంలేదు. మన ఊరు మనబడి కార్యక్రమం సన్నాహక సమావేశంలో బయోమెట్రిక్ విధానం పెట్టాలని జిల్లా ప్రజాప్రతినిధులు తీర్మానించినా, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈవిధానాన్ని వ్యతిరేకించడంతో దాన్ని అమలు చేయలేకపోతున్నారన్న ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి ఈ విధానం అమల్లోకి వస్తే ఉపాధ్యాయులు హాజరు, సమయపాలన కచ్చితంగా అమలు చేయాల్సి వస్తుంది. తద్వారా ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెరగడంతోపాటు విద్యాబోధన కూడా మెరుగుపడే అవకాశం ఉంది. జిల్లాలో వేలసంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలున్నా.. అధిక సంఖ్యలో విద్యార్థులున్న పాఠశాలలు చాలా తక్కువగా ఉన్నాయి. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని రిజిస్టర్లలో ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పేర్లు రాసి.. ఉపాధ్యాయ పోస్టులు తగ్గకుండా, బదిలీకాకుండా ఉపాధ్యాయులు జాగ్రత్తపడుతున్నారని తెలుస్తోంది. ఇక మండలస్థాయిలో ఎంఈవోపోస్టులు పూర్తిస్థాయిలో భర్తీకాకపోవడంతో ఇనచార్జ్లతోనే నెట్టుకొస్తున్నారు.

పరిశీలనలో ఎన్నో విషయాలు వెలుగులోకి..ఇరుజిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలలు సమస్యల సుడిలో ఉన్నాయి. సోమవరం నుంచి విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో నిర్వహించిన పరిశీలనలో ఎన్నో సమస్యలు వెలుగులోకి వచ్చాయి. చాలా పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్య వేధిస్తోంది. ఎలక్ట్రికల్ పనులు చేపట్టని పరిస్థితి. కొన్ని చోట్ల స్లాబులకు పగుళ్లు రావడం, పెచ్చులు ఊడిపడటం, ఫర్నిచర్ అధ్వానంగా ఉండటం, మైదానాలు అపరిశుభ్రంగా ఉండటం లాంటి సమస్యలున్నాయి. ఇక జిల్లాకురావాల్సిన పాఠ్యపుస్తకాలు ఇంకా చేరలేదు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించాల్సిన అవసరం ఉంది. రోజువారి పర్యవేక్షణతో ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం జిల్లాలో 1,321 ప్రభుత్వ పాఠశాలల్లో 66,144 మంది బాలురు, 61,350 బాలికలు చదువుతున్నారు. 1నుంచి 8తరగతుల వరకు ఇంగ్లీషుమీడియం ప్రవేశపెట్టరు. మనఊరు మనబడి కింద జిల్లాలో మొదటి విడతగా 426పాఠశాలలను ఎంపికచేయగా ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 364, పట్టణాల్లో 62పాఠశాలలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 44,741మంది, పట్టణాల్లో 14,044మంది విద్యార్థులు చదవుతున్నారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,065 ప్రభుత్వ పాఠశాలల్లో 67,000 మంది విద్యార్థులున్నారు. మనఊరు మనబడి కింద జిల్లాలో మొదటి విడతగా 369 పాఠశాలలను ఎంపిక చేసినా పనులే ప్రారంభం కాలేదు. ఈపాఠశాలల ఆధునికీకరణతో ప్రయోజనం చేకూరుతుందని విద్యాశాఖ పేర్కొంటోంది.

# ముందుంది ముంపుకాలం!



ఖమ్మం : రాబోయే మూడు నెలలు గోదావరి నదీ పరివాహక ప్రాంతాల ప్రజలకు ఎంతో కీలకమైన సమయం. జూలై నుంచి సెప్టెంబరు వరకు గోదావరి ఉగ్రరూపంతో ప్రవహిస్తుంది. ముందస్తు కార్యాచరణతోనే ఈ వరదలను సమర్ధవంతంగా ఎదుర్కొనే అవకాశముంది. ఇందుకోసం ప్రతి సంవత్సరం జూన ఆరంభంలోనే జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి కసరత్తు ప్రారంభిస్తుంది. కానీ ఈ సంవత్సరం ఇంతవరకు ముందస్తున్న కసరత్తుపై ఎలాంటి ప్రయత్నాలూ ప్రారంభం కాలేదు. రాబోయే మూడు నెలలు వరదలు, వ్యాధులపరంగా ఎంతో కీలకం కావడంతో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న కీలక పోస్టులను భర్తీ చేసి మరింత పకడ్బందీగా సేవలందించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాల్సి ఉంది. గోదావరి ఫ్లడ్ మాన్యువల్‌లో పేర్కొన్నట్లు జూన ఆరంభంలోనే జిల్లాస్థాయిలో గోదావరి వరదలపై ముందస్తున్న సమీక్ష సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

మొదటి ప్రమాద హెచ్చరికతోనే... భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరిక (43అడుగులు)కు చేరుకోగానే మొబైల్ టీం అధికారులు భద్రాచలం సబ్‌కలెక్టర్‌కు రిపోర్టు చేసి సన్నద్ధం కావాలి. భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలి. రెండో ప్రమాద హెచ్చరిక 48 అడుగులు, మూడో ప్రమాద హెచ్చరిక 53 అడుగులు చేరగానే అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాల్సి ఉంటుంది. ఇందుకోసం జూనలో నిర్వహించే ముందస్తున్న సమీక్ష సమావేశం ఎంతో కీలకం కానుంది. వరదల సమయంలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు నిత్యవసర సరుకుల కొరత రాకుండా మూడు నెలలకు సరిపడే బఫర్ స్టాక్‌ను నిర్దేశించిన ప్రాంతాల్లో భద్రపరచాల్సి ఉంటుంది. ఈ స్టాక్‌ను భద్రపరిచే సమయంలో అధికారులు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాల్సి ఉంటుంది. గతంలో పలు సందర్భాల్లో వర్షాలూ వరదలకు కొన్ని చోట్ల దాచిన బఫర్‌స్టాక్ తడిచిన ఘటనలున్నాయి.

స్లూయిజ్ సమస్యకు పరిష్కారం ఏదీ ?భద్రాచలం పుణ్యక్షేత్రానికి గోదావరి ముంపు నుంచి విముక్తికోసం వరద కరకట్టను నిర్మించారు. ఇంత వరకు బాగానే ఉన్నా వర్షాలు, వరదల సమయంలో స్లూయిసలను మూసివేస్తుండటంతో సమస్య తలెత్తుతోంది. ముఖ్యంగా విస్తా కాంప్లెక్స్, అశోకనగర్ కొత్తకాలనీ స్లూయిసల వద్ద మురుగునీరు, వర్షపునీరు లిఫ్ట్ చేసేందుకు పూర్తిస్థాయిలో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టలేకపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఏడాది స్లూయిసల నుంచి లీకులు రాకుండా చర్యలు చేపట్టామని అధికారులు పేర్కొంటుండగా చివరకు మురుగునీరును సైతం పూర్తిస్థాయిలో లిఫ్ట్ చేసి ఎత్తిపోయకపోవడంతో చప్టా, దిగువ, దేవస్థానం ఉచిత నిత్యన్నదాన సత్రం పరిసరాల్లోకి మోకాలి లోతులో మురుగునీరు చేరింది. అలాగే అశోకనగర్ కొత్తకాలనీలో సైతం ఇదే పరిస్థితి ఉంది. విస్తాకాంప్లెక్స్ వద్ద 50 హెచపీ సామర్థ్యం గల ఆరు మోటార్లు ఉండగా అందులో నాలుగు పాత మోటార్లే ఉన్నాయి. దీంతో అత్యవసర సమయంలో మురుగునీటిని ఆ మోటార్ల ద్వారా ఎత్తిపోయడం కష్టసాధ్యంగా మారుతోంది. మురుగునీటిని సైతం ఎత్తిపోసే విధంగా మోటార్లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా ఆ దిశగా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మురుగునీటిని సైతం నిరాటంకంగా తోడే 100హెచపీ మోటార్లు నాలుగు ఏర్పాటు చేస్తేనే రామాలయం పరిసర ప్రాంతాల్లో మురుగునీరు ఎత్తిపోసే పరిస్థితి ఉంటుంది. ప్రతి సంవత్సరం ఉండే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా అధికార యంత్రాంగం ఆలోచించకపోవడం పట్ల ఆక్షేపణలు వినిపిస్తున్నాయి.

సెక్టోరియల్, జోనల్ అధికారులదే కీలక బాధ్యతగోదావరి వరద ముంపును సమర్ధవంతంగా ఎదుర్కోవడంలో సెక్టోరియల్, జోనల్ అధికారులదే కీలక పాత్ర. వారు సమర్థవంతంగా పని చేస్తేనే ప్రజలను అత్యవసర పరిస్థితుల్లో కాపాడేందుకు అవకాశం ఉంటుంది. మండలస్థాయిలోనూ వరద సమీక్షలు నిర్వహించి మండల అధికారులను సన్నద్ధం చేయాల్సి ఉంది. వరదల సమయంలో సమాచార వ్యవస్థ ఎంతో కీలకం కావడంతో దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలి.

ఇక పరివాహక ప్రాంతంలో గర్భిణులను గుర్తించి వారిలో వచ్చే మూడు నెలల్లో డెలివరీ అయ్యే అవకాశం ఉన్న వారిని గుర్తించి వారిని అత్యవసర సమయాల్లో సమీప వైద్యశాలలకు తరలించేందుకు వీలుగా చర్యలు చేపట్టాలి.

# సందిగ్ధంలో సబ్సిడీ రుణాలు

ఆదిలాబాద్ : అన్నివర్గాల పేద ప్రజల, యువత ఆర్థికాభివృద్ధి కోసం సబ్సిడీపై రుణాలు అందించేందుకు ఏర్పాటు చేసి ఉన్న కార్పొరేషన్ల పరిస్థితి అగమ్యఘోచరంగా మారింది. గతంలో అర్హులైన పేద వారికి అందించే సబ్సిడీ రుణాలు నేడు సందిగ్ధంలో పడిపోయాయి. స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకునే ప్రతీ ఒక్కరికి సబ్సిడీ రుణాలు మంజూరు చేసే కార్పొరేషన్లు ప్రస్తుతం జిల్లాలో ఉత్సవ విగ్రహాలుగా మారాయి. ప్రస్తుతం ఒక్క దళితబంధు పథకం మినహాయిస్తే సబ్సిడీ రుణాల సంగతి అసలు పత్తాలేకుండా పోయింది. జిల్లాలోని 18మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందించే ఆర్థిక భరోసా గత నాలుగేళ్లుగా నీరుగారుస్తోంది. ఎన్నో ఉద్యమాల ద్వారా సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో క్రమక్రమంగా సబ్సిడీ రుణాల పరిస్థితి సన్నగిల్లి పోయింది. కార్పొరేషన్లు అంటేనే ఆ జిల్లాలోని అన్నివర్గాల పేద ప్రజలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చే విధంగా ఉన్నటువంటి వాటి పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వం తీరుతో అగమ్యఘోచరంగా మారింది. కాస్తోకూస్తో ఆర్థిక సహాయాన్ని చేకూర్చే ఈ కార్పొరేషన్లు నేడు సబ్సిడీ రుణాలు ఇవ్వకపోవడంతో వీటిపై ఆధారపడిన ఎన్నో వేల కుటుంబాలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయాయి. పత్తాలేని ఎన్నికల హామీప్రతీ ఒక్కరికి సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తాం అన్న 2018 ఎన్నికలకు ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నాలుగేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. కాని రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్సిడీ రుణాల విషయాన్నే టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువత నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న ఫలితం దక్కడం లేదు. నిరుద్యోగులకు చేయూతనిచ్చేందుకు ఎన్నో కార్యక్రమాలు చేస్తున్న ట్లు ప్రకటనలు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితికి పొంతన కుదరడం లేదు. దళితులను ఆదుకోవడానికి దళితబంధు అమలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, వారికి మిగిలిన పథకాలను అందకుండా చేస్తోంది. దీనికి తోడు తమకు ఎటువంటి పథకాన్ని అమలు చేయడం లేదని, పైగా ఇప్పటి వరకు అమలు చేస్తున్న పథకాలను నిలుపు చేశారని జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాల యువత ఆవేదన వ్యక్తం చేస్తోంది. సబ్సిడీ రుణాల కోసం వచ్చిన దరఖాస్తులు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కార్పొరేషన్ల వద్ద నాలుగేళ్లుగా గుట్టలుగా పేరుకు పోతున్నాయని ఆరోపిస్తున్నారు.13,106 దరఖాస్తుల పెండింగ్ఆదిలాబాద్ జిల్లాలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో గత నాలుగేళ్ల కాలంలో జిల్లావ్యాప్తంగా ఉన్న బీసీ యువతీయువకులు, అర్హులైన లబ్ధిదారులు 13వేల 328 మంది సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. స్వరాష్ట్రంలో ఇక ఆర్థికంగా ఎదుగుతామని, మాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని, ఎంతో ఆశగా దరఖాస్తు చేసుకున్న వీరికి నిరాశే మిగిలింది. జిల్లాలో 2018 నుంచి ఇప్పటి వరకు 15వేల 328 మంది సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా, కేవలం




2,222 మందికి మాత్రమే ప్రభుత్వం సబ్సిడీ రుణం మంజూరు చేసింది. అయితే ఈ రుణం మంజూరిపై కూడా లబ్ధిదారులు ఆగ్రహంతో ఉన్నారు. ముఖ్యంగా రూ.2లక్షలు, రూ.లక్ష కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం కేవలం వందశాతం సబ్సిడీ పేరుతో 2,222 మందికి రూ.50 వేల చొప్పున మంజూరు చేసింది. ఇందులో తొమ్మిది ఫెడరేషన్లకు గాను 105 మంది కూడా ఉన్నారు. ఇంకా నాలుగేళ్లుగా 13,106 మంది సబ్సిడీ రుణం కోసం బీసీలు ఎదురుచూస్తున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని మండిపడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల పరిస్థితి అంతే..రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాల కోసం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు కూడా ఎదురుచూస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న వీరికి ఆయా శాఖల ద్వారా తూతూ మంత్రంగా సబ్సిడీ రుణాలు అందిస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. ఇందులో దళితబంధు పథకం ఊరటతో ఎస్సీల పరిస్థితి కొంత మెరుగ్గానే ఉన్నప్పటికీ ఇందులో కూడా వేలల్లో లబ్ధిదారులు అర్హులై ఉన్నప్పటికీ రుణం అందడం లేదు. గత 2018 నుంచి ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2158 మంది సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా, కేవలం 413 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేసింది. 2018-19 సంవత్సరానికి గాను 244 మంది ఎస్సీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణం కోసం దరఖాస్తు చేసుకోగా, ఇందులో 224 మందికి మంజూరి ఇచ్చిన అధికారులు 207 మందికి సబ్సిడీ రుణాలను అందించారు. ఇక 2019-20 సంవత్సరంలో రూపాయి రుణం ఇచ్చిన పరిస్థితి లేదు. అదేవిధంగా 2020-21 సంవత్సరంలో 1914 మంది దరఖాస్తు చేసుకోగా.. 212 మందికి మంజూరి ఇచ్చిన సంబంధిత అధికారులు.. కేవలం 201 మందికి మాత్రమే సబ్సిడీ రుణాలు అందించారు. అయితే మిగిలిన 1,745 మంది సబ్సిడీ రుణాల కోసం ఎదురుచూడక తప్పడం లేదు. ఇక ఎస్టీ మైనార్టీల పరిస్థితి గుడ్డిలో మెల్ల అన్నట్టుగా ఉందని ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తుంది. అం తేకాకుండా ఎస్టీలకు ఉట్నూర్‌లోని ఐటీడీఏల ద్వారా అంతోకొంతో రుణాలు అందిస్తుండగా మైనార్టీ శాఖ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రుణం అందని పరిస్థితి కనిపిస్తున్నట్లు తెలుస్తుంది.ఏది ఏమైనా ఉమ్మడి రాష్ట్రంలో కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందిన జిల్లాలోని ఆయా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో మాత్రం సబ్సిడీ రుణాలకు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూపులు తప్పడం లేదని జిల్లాలోని లబ్ధి దారులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సబ్సిడీ రుణాలపై దృష్టి సారించాలని, భాగంగా యువత, నిరుపేద ప్రజలను ఆర్థికంగా ఆదుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

# రైతులను ఆదుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా?

## రైతులకు జగన్ సమాధానం చెప్పాలి: చంద్రబాబు




అమలాపురం: అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెదేపా అధినేత చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా 40-50 శాతం పంట కల్లాలు, చేల్లోనే ఉందన్నారు. రైతులను ఆదుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా? అని నిలదీశారు. కౌలు రౌతుల పరిస్థితేంటని సీఎం జగన్‌ను ఆయన ప్రశ్నించారు. కోనసీమ జిల్లా వేగాయమ్మపేటలో పాడైన పంటలను చంద్రబాబు పరిశీలించారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వైకాపా ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "ధాన్యం కొనలేని అసమర్థ ప్రభుత్వమిది. పంట తడిసిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సకాలంలో గోనె సంచులను పంపించడం కూడా ఈ ప్రభుత్వానికి చేతకాదా? పంపించిన కొన్ని సంచుల్లో చిరిగినవి ఉన్నాయి. అధికారులు మాత్రం ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. రైతుల వద్దకు వచ్చే తీరిక జగన్‌కు లేదా? రైతులు ఇబ్బందుల్లో ఉంటే మంత్రులెక్కడ? పాడైన పంటకు నష్టపరిహారం ఎప్పుడిస్తారు? రైతుల జీవితాలతో ఆడుకుంటారా? సాయంత్రంలోపు సీఎం సమాధానం చెప్పాలి. అలా చెప్పకపోతే రైతులను మోసం చేసినట్లే. బాధిత రైతులకు పరిహారం ఎప్పుడిస్తారో స్పష్టంగా చెప్పాలి. కౌలు రైతులకు ఎలా న్యాయం చేస్తారో చెప్పాలి. న్యాయం చేయలేకపోతే జగన్‌కు సీఎం పదవిలో కొనసాగే అర్హత లేదు. రైస్‌మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడలా? రైతు పండించిన ప్రతి గింజా కొనాల్సిందే" అని చంద్రబాబు డిమాండ్ చేశారు.



## వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

నెల్లూరు మాజీ జెడ్పీ ఛైర్మన్, టీడీపీ నేత బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. శుక్రవారం.. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయనకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బొమ్మిరెడ్డితో పాటు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, టీడీపీ నేత ఇందూరు వెంకటరమణా రెడ్డి వైఎస్ఆర్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్ రెడ్డి, వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు.




దిల్లీ: ఆమ్రపాలి గ్రూప్ నిధుల అవకతవకల కేసులో ఆ సంస్థ మాజీ సీఎండీ అనిల్ కుమార్ శర్మ బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇళ్ల కొనుగోలుదారులను మోసగించిన ఆయనపై తాము సానుభూతి చూపించలేమని జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఈ సందర్భంగా అనిల్ శర్మ బెయిల్ పిటిషన్‌పై కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "మీరు వేల మందిని మోసగించారు. ఇది సాదాసీదా మోసం కాదు. మీరేం చేశారో ఈ కోర్టుకు బాగా తెలుసు. మీ నేరం చాలా తీవ్రమైనది. ఇళ్ల కొనుగోలుదారులు ఎంతోకాలం కష్టపడి సంపాదించుకున్న డబ్బును.. వారి జీవితకాల సేవింగ్స్‌ను దోచుకున్నారు. మీ వల్ల వేల మంది ఇబ్బంది పడుతున్నారు. వారి భవిష్యత్తును మీరు గందరగోళంలో పడేశారు. వారి సమస్యకు మేం పరిష్కారం కూడా కనుగొనలేకపోతున్నాం. సానుభూతి చూపించేందుకు మీరు ఏ విధంగానూ అర్హులు కాదు. మీరు జైల్లో ఉండటమే ఉత్తమం..!" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనిల్ బెయిల్ అభ్యర్థనపై దర్యాప్తు సంస్థలకు నోటీసులిచ్చేందుకు నిరాకరించిన కోర్టు.. అతడి పిటిషన్‌ను కొట్టేసింది. ఉత్తర్‌ప్రదేశ్ లోని గ్రేటర్ నోయిడా పరిధిలో ఫ్లాట్లు నిర్మించి ఇస్తామని ఆమ్రపాలి గ్రూప్ దాదాపు 42వేల మంది నుంచి డబ్బులు తీసుకుంది. ఎంతకీ ఇళ్లు కట్టించకపోవడంతో మోసపోయామని గ్రహించిన పలువురు కొనుగోలుదారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై గతంలో విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కంపెనీ కార్యకలాపాలపై ఫోరెన్సిక్ తనిఖీ నిర్వహించాలని ఆదేశించింది. ఆ తనిఖీల్లో రూ.5,619 కోట్ల నిధులను కంపెనీ వివిధ అనుబంధ సంస్థల్లోకి దారి మళ్లించిందని ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ఆ నివేదిక ఆధారంగా అనిల్ శర్మతో పాటు కంపెనీకి చెందిన పలువురు డైరెక్టర్లను అరెస్టు చేశారు. మోసం, ఇతర కేసుల కింద వారంతా 2018 నుంచి జైల్లో ఉన్నారు.




పనాజీ: దాయాది దేశం పాకిస్థాన్ సమక్షంలో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించారు. ఉగ్రముప్పు ఇప్పటికీ కొనసాగుతోందని, దానికి ఏ రకమైన సమర్థింపు ఉండకూడదని స్పష్టంగా చేశారు. గోవా వేదికగా భారత్ నేతృత్వంలో జరుగుతోన్న షాంఘై సహకార సంస్థ విదేశాంగ మంత్రుల మండలి సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఉగ్రవాదం ప్రజా ప్రయోజనాలకు హానికరం. ఉగ్రమూకలకు అందుతున్న ఆర్థిక సహకారాన్ని మరో ఆలోచన లేకుండా వెంటనే అడ్డుకోవాలి. ఒకవైపు ప్రపంచం కొవిడ్ ప్రభావాలను ఎదుర్కొంటుండగా.. ఉగ్రవాద ముప్పు నిరాటంకంగా కొనసాగుతోంది. దీనికి ఎలాంటి సమర్థింపు ఉండకూడదని మేం బలంగా విశ్వసిస్తున్నాం. సీమాంతర ఉగ్రవాదం సహా ఉగ్ర సమస్య ఏ రూపంలోనే ఉన్నా కట్టడి చేయాల్సిందే. ఎస్‌సీఓ ఆదేశాలలో ఉగ్రవాదంపై పోరాటం కూడా ఒకటి. అలాగే సభ్య దేశాల మధ్య శాంతి, సుస్థిరత్వానికి భారత్ అత్యంత ప్రాముఖ్యత ఇస్తుంది. కొవిడ్, భౌగోళిక-రాజకీయ ఘర్షణలతో ఈ ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. దాని వల్ల సరఫరా గొలుసులకు అంతరాయం ఏర్పడుతోంది' అని వెల్లడించారు. అలాగే ఎస్‌సీఓ పరిశీలక దేశమైన అఫ్గానిస్థాన్‌లో నెలకొన్న పరిస్థితుల గురించి ప్రస్తావించారు. ఆ దేశానికి మానవతా సాయాన్ని అందించడం, అందరిని కలుపుకొని పోయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, మహిళలు, చిన్నారుల హక్కుల్ని కాపాడటం వంటి అంశాలు తమ తక్షణ ప్రాధాన్యాలని వెల్లడించారు. అంతేగాకుండా మొదటిసారి ఎస్‌సీఓ దేశాలకు అధ్యక్షత వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు.. రష్యా, చైనా విదేశాంగ మంత్రులు సెర్గే లవ్రోవ్, చిన్ గ్యాంగ్‌లతో మన విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ వేర్వేరుగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సదస్సులో పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ కూడా పాల్గొన్నారు. అయితే ఈ సమావేశంలో భారత్‌తో ఎలాంటి ద్వైపాక్షిక చర్చలు ఉండబోవని ముందే ప్రకటించిన పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టోకు.. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మర్యాదపూర్వకంగా షేక్‌హ్యాండ్ ఇచ్చినట్లు తెలుస్తోంది.




## ఉగ్రఘాతుకం.. పేలుడులో ఐదుగురు జవాన్లు మృతి

రాజౌరీ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు ఘాతుకానికి తెగబడ్డారు. వారు జరిపిన బాంబు పేలుడులో ఐదుగురు సైనికులు మృతి చెందారు. మరో జవాను చికిత్స పొందుతున్నాడు. రాజౌరీ జిల్లాలోని కాండి అటవీ ప్రాంతంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో ఆర్మీ ట్రక్కు పేలి ఐదుగురు సైనికులు మృతి చెందిన సంగతి తెలిసిందే. జవాన్లతో వెళ్తున్న ట్రక్కుపై ఉగ్రవాదులు గ్రనేడ్ దాడి చేయడంతో ఐదుగురు జవాన్లు సజీవ దహనమయ్యారు. భారీ వర్షాలు, విజిబులిటీ సరిగా లేకపోవడం వంటి పరిస్థితులను అనుకూలంగా మలచుకొని సైనికులు వెళ్తున్న ట్రక్కును లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు ఈ దుశ్చర్యకు దిగారు. ఆ ఘటనకు పాల్పడిన ముష్కరులు కాండి ఫారెస్ట్‌లోని ఓ గుహలో ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి ఆర్మీకి సమాచారం అందింది. దాంతో గురువారం నుంచి బలగాలు ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. శుక్రవారం ఉదయం ఉగ్రవాదుల జాడ గుర్తించడంతో.. ఇరువైపులా ఎన్‌కౌంటర్ మొదలైంది. అక్కడి నుంచి తప్పించుకునేందుకు ఉగ్రవాదులు పేలుడు పదార్థాన్ని ఉపయోగించారు. ఆ ఘటనలో ఇద్దరు ఆర్మీ అధికారులు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను ఉధంపుర్‌లోని కమాండ్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరో ముగ్గురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ ఉగ్రవాదులు ఆ ప్రాంతంలోనే దాక్కొని ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాజౌరీ జిల్లాలో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు.




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్న పదో తరగతి ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 6న (శనివారం) ఉదయం 11గంటలకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో 'పది' ఫలితాలు విడుదల చేయనున్నారు. ఉపాధ్యాయ సంఘాల నేతలతో శుక్రవారం జరిగిన చర్చల సందర్భంగా మంత్రి బొత్స స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. అలాగే, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానంద రెడ్డి సైతం అధికారిక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను www.eenadu.net, https://www.results.bse.ap.gov.in/ వెబ్‌సైట్‌లలో చెక్ చేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా 3,349 కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి పరీక్షలను 6.5లక్షల మందికి పైగా విద్యార్థులు రాసినట్టు దేవానందరెడ్డి ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగ్గా.. 19 నుంచి 26వరకు స్పాట్ వాల్యుయేషన్ చేపట్టారు.




హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి సీబీఐ కోర్టులో లొంగిపోయారు. జూన్ 2వ తేదీ వరకు న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించింది. దీంతో ఎర్ర గంగిరెడ్డిని కాసేపట్లో చంచల్‌గూడ జైలుకు సీబీఐ అధికారులు తరలించనున్నారు. హత్య కేసులో ఏ1గా ఉన్న ఎర్రగంగిరెడ్డి బెయిల్‌పై బయట ఉండటం వల్ల కేసు దర్యాప్తునకు ఆటంకం కలుగుతోందని.. సహకరించేందుకు ప్రజలెవరూ ముందుకు రావడం లేదని సీబీఐ గతంలో ఆరోపించింది. ఆ మేరకు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరింది. దీంతో ఆయన బెయిల్ రద్దు చేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మే 5లోపు సీబీఐకి లొంగిపోవాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎర్ర గంగిరెడ్డి సీబీఐ ఎదుట లొంగిపోయారు.

## అప్పుడు నిద్రపోయి... ఇప్పుడు కళ్యాణమస్తు అంటూ డ్రామా

అమరావతి: సీఎం జగన్ ప్రజలకు సేవ చేయకుండా అబద్ధాలతో మోసం చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మ్యానిఫెస్టోలో ప్రకటించిన 100 పథకాలు జగన్ ఎగ్గొట్టారని విమర్శించారు. నాలుగేళ్ల పాటు నిద్రపోయి ఎన్నికల ముందు కళ్యాణమస్తు అంటూ డ్రామాకు తెరతీశారన్నారు. నాడు లోటు బడ్జెట్‌లో కూడా పెళ్లికానుక కింద రూ.307 కోట్లు ఖర్చు చేసిన ఘనత టీడీపీదే అని చెప్పుకొచ్చారు. టీడీపీ హయాంలో రేషన్ కార్డే ప్రామాణికంగా పెళ్లిపీటల మీదే వధూవరులకు పెళ్లికానుక అందజేశామన్నారు. జగన్ రెడ్డి కఠిన నిభందనలు పెట్టి లబ్దిదారుల సంఖ్యను తగ్గిస్తున్నారని అన్నారు. రూ.10 వేలకు మించి ఆదాయం ఉన్నా, 300 యూనిట్లు విద్యుత్ వాడినా పథకానికి అనర్హులంట అంటూ మండిపడ్డారు. ఏపీకి చెందనివారైతే పెళ్లికానుక ఇవ్వరా? పక్క రాష్ట్రాల వారిని పెళ్లి చేసుకోకూడదా? అని టీడీపీ నేత ప్రశ్నించారు. విలీనం పేరుతో 15 వేల పాఠశాలలను మూసేసిన జగన్.. 10 తరగతి పాసైతేనే పెళ్లికానుక ఇస్తామనటం సిగ్గుచేటని అన్నారు. పెళ్లికానుక పెండింగ్ నిధులన్నీ విడుదల చేస్తామని 2019 జీవో 105 ఇచ్చారని.. కానీ ఇప్పటి వరకు ఒక్కరికీ ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. తర్వాత ఫిబ్రవరిలో 4500 మందికి పెళ్లికానుక ఇస్తున్నట్టు సీఎం బటన్ నొక్కారని.. ఇప్పటికీ ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ బటన్ నొక్కి డబ్బులిస్తున్నామంటూ మరో నాటకం ఆడుతున్నారన్నారు. కళ్యాణ మిత్రలకు వేతనాలు రూ. 43 కోట్లు బకాయిలున్నాయని తెలిపారు. సాక్షి పత్రికకు ప్రకటనల పేరుతో ప్రజాధనం దోచిపెట్టడం తప్ప నాలుగేళ్లలో ఒక్కరికైనా పెళ్లికానుక కింద ఒక్క రూపాయైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. టీడీపీ సన్ రైజ్ పార్టీ అయితే వైసీపీ గుడ్లగూబల పార్టీ అని అన్నారు. చంద్రబాబు సూర్యుడు లాంటి వారని.. ఆయన వెలుగును వైసీపీ నేతలు చూడలేరన్నారు. అందుకే చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేస్తున్నారంటూ పంచుమర్తి అనురాధ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## అమరావతి పేదల ఇళ్ల పట్టాల పంపిణీకి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్




అమరావతి: అమరావతి పేదల ఇళ్ల పట్టాల పంపిణీకి ఏపీ హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జీవో నెం.45పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని దాఖలైన పిటిషన్ కోర్టు కొట్టివేసింది. ప్రభుత్వం తరపున అడిషనల్ ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వ వాదనతో ఏపీ హైకోర్టు ఏకీభవించింది. ఇళ్ల స్థలాల పంపిణీ కోర్టు తీర్పుకు లోబడి ఉండాలని, రాజధాని ఏ ఒక్కరికో.. ఒక వర్గానికో పరిమితం కాదని.. పిటిషన్ విచారణ సందర్భంగా సీజే ప్రశాంత్‌కుమార్ మిశ్రా కీలక వ్యాఖ్యలు చేశారు. రాజధాని ప్రజలందరిది. రాజధానిలో పేదలు ఉండకూడదంటే ఎలా అని ధర్మాసనం ప్రశ్నించింది. "రాజధాని ప్రాంతంలో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడం అభివృద్ధిలో భాగమే.

పలానా వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని చెప్పడం కరెక్ట్ కాదు. రాజధాని భూములు ప్రస్తుతం సీఆర్డీఏవే. భూములు వారివి కావు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంపై కోర్టును ఆశ్రయిస్తున్నారు.

రాజధాని విషయంలో కొన్ని అంశాలు హైకోర్టులో.. కొన్ని అంశాలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. నిర్ణయాలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని నిరోధించలేం. నిర్ణయాలు తీసుకోవడం ప్రభుత్వం విధుల్లో భాగం" అని హైకోర్టు స్పష్టం చేసింది.

# త్రిష సూపర్ మోడ్రన్ లుక్ అదుర్స్

1999 లో జోడీ సినిమాలో చిన్న పాత్రలో నటించిన త్రిష హీరోయిన్ గా మొదటి సినిమాను 2002 సంవత్సరంలో చేసింది. అంటే త్రిష సినీ కెరీర్ ను ప్రారంభించి రెండు దశాబ్దాలకు పైగా పూర్తి అయ్యింది. సాధారణంగా హీరోయిన్స్ అయిదు పది సంవత్సరాలు కొనసాగడం గొప్ప విషయం. హీరోలతో పోల్చితే హీరోయిన్స్ కెరీర్ స్పాన్ చాలా తక్కువగా ఉంటుంది. కానీ త్రిష విషయంలో ఆ విషయం తప్పు అని తేలిపోయింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలకు పైగా పూర్తి అయినా కూడా త్రిష జోరు చూస్తూ ఉంటే



ఆశ్చర్యంగా ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. త్రిష ప్రస్తుతం చేస్తున్న సినిమాలు చాలానే ఉన్నాయి. ఇటీవల ఆమె నటించిన పొన్నియిన్ సెల్వన్ 2 సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో ఐశ్వర్య ను మించి త్రిష అందంగా కనిపించిందంటూ ఆమె అభిమానులు మాట్లాడుకుంటున్నారు. త్రిష అందం గురించి ఎంత మాట్లాడుకున్నా తక్కువే అవుతుందని ఈ ఫోటోను చూస్తే మరోసారి అర్థం అవుతుంది. స్టైలిష్ కూల్ డ్రెస్ లో అంతకు మించిన స్టైలిష్ షేడ్స్ ను ధరించిన త్రిష స్మైల్ ను చూసి ఎంతటి వారైనా పడిపోవాల్సిందే. ఆ నిలబడిన స్టైల్ మరియు ఆమె బాడీ లాంగ్వేజ్ లో ఉన్న స్టైల్ కు అభిమానులు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరు కూడా లైక్ కొట్టకుండా ఉండలేక పోతున్నారు. ఈ స్థాయిలో అందంగా ఉంటుందే కనుకే నాలుగు పదుల వయసులో కూడా త్రిష ఫుల్ బిజీగా ఉంది. పొన్నియిన్ సెల్వన్ 2 సినిమా సూపర్ హిట్ అవ్వడంతో తమిళంలో ఈమె ఎక్కువ ఆఫర్లు దక్కించుకుంటుంది. ఇదే సమయంలో ఈమె మరింతగా తన పారితోషికంను పెంచినట్లుగా వార్తలు వస్తున్నాయి.

## శృతి నిర్ణయంపై విభిన్న అభిప్రాయాలు..!

కమల్ కూతురిగా వచ్చీ రాగానే స్టార్ క్రేజ్ తెచ్చుకుంటుంది అనుకున్న శృతి హాసన్ కెరీర్ మొదట్లో హిట్ కోసం చాలా కాలం ఎదురు చూడాల్సి వచ్చింది. అటు తమిళ్ ఇటు తెలుగులో సినిమాలు చేస్తున్నా హిట్ జోష్ ఇవ్వలేదు. అయితే పవర్ స్టార్ సినిమాతో బ్లాక్ బస్టర్ బోణీ కొట్టేసింది అమ్మడు. పవన్ కళ్యాణ్ తో గబ్బర్ సింగ్ సినిమా చేసిన శృతి హాసన్ ఆ సినిమా హిట్ అమ్మడి ఫేట్ మార్చేసింది. తెలుగు లో అప్పటివరకు శృతి ని తీసుకోవాలా వద్దా అనుకున్న వారంతా ఆమె కోసం క్యూ కట్టారు. తెలుగు లో ఆమె క్రేజ్ చూసి కోలీవుడ్ లో కూడా వరుస ఛాన్స్ లు ఇచ్చారు. మధ్యలో తెలుగు సినిమాలను నిర్లక్ష్యం చేస్తుంది అన్న వార్తలు రాగా మళ్లీ క్రాక్ వకీల్ సాబ్ సినిమాలతో అమ్మడు అలరించింది. ఇక ఈ ఏడాది సంక్రాంతి



కి పోటా పోటీగా వచ్చిన వాల్తేరు వీరయ్య వీర సింహా రెడ్డి రెండు సినిమాల్లో శృతి హాసన్ హీరోయిన్ గా నటించింది. ఈ రెండు సినిమాల సక్సెస్ ఆమెకు మరింత జోష్ ఇచ్చింది. సీనియర్ హీరోల సరసన తాను హీరోయిన్ ఏంటి అని ఆలోచించకుండా శృతి వచ్చిన ఛాన్స్ ని వాడేసుకుంది. ప్రస్తుతం ప్రభాస్ తో సలార్ సినిమా చేస్తున్న శృతి హాసన్ నాని 30వ సినిమాలో కూడా ఒక ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తుందని తెలుస్తుంది. సినిమా లో నానికి ఒక ఫ్లాష్ బ్యాక్ లవ్ స్టోరీ ఉంటుందట అందులో శృతి హాసన్ తో నాని లవ్ ట్రాక్ ఉంటుందట. అయితే శృతి హాసన్ ఓ పక్క ప్రభాస్ లాంటి స్టార్ హీరో సినిమాలో మెయిన్ లీడ్ గా చేస్తూ ఇలా నాని సినిమాలో స్పెషల్ రోల్ చేయడం ఆమె ఫ్యాన్స్ ని ఇబ్బంది పెడుతుంది. శృతి అంత ఆలోచించలేనంత అమాయకురాలు కాదు సినిమాలో ఆమె పాత్ర చాలా బాగుంటుంది కాబట్టే నాని సినిమాకు ఆమె సైన్ చేసిందని అంటున్నారు కొందరు. ఏది ఏమైనా నాని తో శృతి హాసన్ ఫస్ట్ టైం స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. దసరాతో నాని తన స్టామినా ఇది అని ప్రూవ్ చేసుకున్నారు. శృతి నాని సినిమాకు సైన్ చేయడం మంచి నిర్ణయమా కాదా అన్నది సినిమా రిలీజ్ అయ్యాక తెలుస్తుంది. ఈ సినిమాను డిసెంబర్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నాడు నాని.




# కేరళ చీరలో గోల్డెన్ లెగ్ బ్యూటీ క్లీ వేజ్ షో



భీమ్లా నాయక్ లో రానా కు జోడీగా నటించి మెప్పించిన సంయుక్త మీనన్ ఆ తర్వాత బింబిసార సినిమాలో నటించి సక్సెస్ ను తన ఖాతాలో వేసుకున్న విషయం తెల్సిందే. ధనుష్ కి జోడీ గా సార్ సినిమాలో కూడా నటించి మెప్పించింది. ఆ సినిమా సక్సెస్ ని దక్కించుకుంది. తాజాగా వచ్చిన విరూపాక్ష చిత్రం కూడా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. విరూపాక్ష చిత్రం వంద కోట్ల వసూళ్ల దిశగా దూసుకు పోతుంది. ఈ నేపథ్యంలో లక్కీ బ్యూటీ కాస్త గోల్డెన్ లెగ్ అంటూ సంయుక్త మీనన్ ప్రశంసలు దక్కించుకుంటున్న విషయం తెల్సిందే. ఈ గోల్డెన్ లెగ్ బ్యూటీ అందాల ఆరబోతతో ఎప్పటికప్పుడు అలరిస్తూనే ఉంది. తాజాగా మరోసారి చీర కట్టు లో మెప్పించింది. కేరళ చీర కట్టులో సాధారణంగానే ముద్దుగుమ్మలు చాలా ముద్దుగా ఉంటారు. అలాంటిది సంయుక్త మీనన్ కేరళ చీర కట్టు లో క్లీవేజ్ షో తో అందరిని కూడా సర్ ప్రైజ్ చేస్తోంది. ఆకట్టుకునే ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నిరూపితం అయ్యింది. ఈ స్థాయి లో అందాలను ఆరబోయడంతో పాటు గోల్డెన్ లెగ్ అంటూ ప్రశంసలు దక్కించుకోవడం తో మరింతగా ఆఫర్లను దక్కించుకుంటూ దూసుకు పోతుంది. ఆకట్టుకునే రూపం ఈ అమ్మడి సొంతం.. అంతే కాకుండా లక్ కలిసి వస్తుండటంతో మళ్లీ మళ్లీ పెద్ద సినిమా ల్లో అవకాశాలు వస్తున్నాయి. తెలుగు మరియు తమిళంలో వరుసగా సినిమాలు చేస్తూ సంయుక్త మీనన్ సందడి చేస్తోంది.

# విమానంలో అనసూయ లుక్ అదిరిందిగా..!




విలక్షణ నటుడు దర్శక – రచయిత సముద్రఖని ప్రధాన పాత్రలో వస్తున్న మూవీ విమానం. అంగ వైకల్యంతో బాధపడే మధ్య వయస్కుడిగా భార్య లేకపోయినా కొడుకుని అల్లారు ముద్దుగా పెంచే తండ్రి వీరయ్య పాత్రలో సముద్రఖని నటిస్తున్నారు. తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం ఆ కుమారుడి విమానం ఎక్కాలన్న కోరిక చుట్టూ సినిమా సాగుతుందని ఇప్పటికే విడుదలైన సినిమాలు చూస్తే అర్థం అవుతోంది. విమానం చిత్రంలో అనసూయ భరద్వాజ్ పాత్ర ప్రత్యేకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. తాజాగా విమానం మూవీ మేకర్స్ మేడే సందర్భంగా అనసూయ భరద్వాజ్ లుక్ తో కూడిన ఓ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో అనసూయ చీర ధరించి కనిపించింది. లోనెక్ బ్లౌజ్ నుండి అందాలు ఆరబోసింది చేసింది. ఒక కాలు పైకి పెట్టి కూర్చుంది. ఈ లుక్ ను బట్టి విమానం సినిమాలో అనసూయ మాస్ తరహా పాత్రలో నటిస్తున్నట్లు అర్థమవుతోంది. విమానం మూవీ జూన్ 9 వ తేదీన విడుదల కానున్నట్లు మూవీ మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. జీ స్టూడియోస్ కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్ సంస్థలు విమానం చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. శివ ప్రసాద్ యానా దర్శకత్వం వహిస్తున్నారు. కాగా మే 2వ తేదీన విమానం సినిమా నుండి తొలి పాట విడుదల కానుంది. 'రేలా రేలా..' అంటూ సాగే పాటను మే 2న మధ్యాహ్నం 3 గంటలకు రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి చరణ్ అర్జున్ సంగీతం అందిస్తున్నారు. మాస్టర్ ధ్రువన్ ధన్ రాజ్ రాహుల్ రామకృష్ణ రాజేంద్రన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అలాగే గుడుంబా శంకర్ భద్ర లాంటి సూపర్ హిట్ సినిమాలు చేసి చాలా కాలంగా ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్న మీరా జాస్మిన్ ఈ చిత్రం ద్వారా సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టనుంది. విమానం మూవీలో మీరా జాస్మిన్ పాత్ర కూడా కీలకమని చెబుతున్నారు. ఇప్పటికే విడుదలనై ప్రోమో పోస్టర్లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆద్యంతం భావోద్వేగాల కలబోతగా సాగుతుందని మూవీ మేకర్స్ చెబుతున్నారు.

# అక్కడ ఐశ్వర్య దూకుడు..!


చూడగానే మన పక్కింటి అమ్మాయిలా అనిపించే హీరోయిన్స్ కొంతమంది ఉంటారు అందులో ఒకరు తమిళ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్. ఒకప్పుడు తెలుగు సినిమాల్లో నటించిన రాజేష్ తనయురాలు ఆమె. సీనియర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ శ్రీలక్ష్మికి స్వయానా మేనకోడలు. తమిళ సినిమాలతో పరిచయమై తెలుగులో కూడా సినిమాలు చేస్తూ వస్తుంది. శైలజా కృష్ణమూర్తి మిస్ మ్యాచ్ వరల్డ్ ఫేమస్ లవర్ టక్ జగదీష్ సినిమాల్లో నటించింది అమ్మడు. తనకు ఇచ్చిన క్యారెక్టర్ కి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తున్న అమ్మడు కెరీర్ లో సక్సెస్ జోష్ ని రుచి చూడలేకపోతుంది. సినిమాలు వరుసగా చేస్తున్నా సరే వాటితో అమ్మడికి తగిన ఐడెంటిటీ మాత్రం రావట్లేదు. అయితే ఈ మధ్య సినిమాలతో పాటుగా ఓటీటీ వెబ్ సీరీస్ లలో



కూడా ఐశ్వర్య రాజేష్ ఎక్కువగా కనిపిస్తుంది. ది గ్రేట్ ఇండియన్ కిచెన్ రన్ బేబీ రన్ స్వప్న సుందరి సినిమాలతో ఓటీటీ ఆడియన్స్ ని అలరిస్తుంది ఐశ్వర్య. సినిమా ఎక్కడ పడితే ఏంటి చెప్పండి ఈ సీరీస్ లు చూసిన ఓటీటీ ప్రేక్షకులు ఐశ్వర్యకి మంచి పాత్ర పడితే అదరగొట్టేస్తుందని చెప్పుకుంటున్నారు. హీరోయిన్స్ లో సహజంగా నటించే వారు చాలా తక్కువ. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్స్ కేవలం పాటలకే అంకితం అవుతుంటారు. కానీ ఐశ్వర్య రాజేష్ లాంటి హీరోయిన్స్ కి మంచి స్టోరీ పడితే మాత్రం తప్పకుండా ఆమె లైం లైట్ లోకి వస్తుందని చెప్పొచ్చు. తెలుగులో చేసిన సినిమాలన్నీ నిరాశపరచడంతో ఆమెతో సినిమా అంటే ఎవరు ముందుకు రావట్లేదు. అందుకే వచ్చిన ఛాన్స్ లను వాడుకుంటూ అది సినిమా అయినా ఓటీటీ వెబ్ సీరీస్ అయినా చేస్తూ వస్తుంది ఐశ్వర్య రాజేష్. మరి రాబోతున్న రోజుల్లో అయినా ఐశ్వర్యా రాజేష్ కి మంచి ఆఫర్లు వచ్చి సక్సెస్ ట్రాక్ ఎక్కుతుందేమో చూడాలి.

## అమ్మడు అందం తింటుందో ఏమో..?

2001లో వచ్చిన ఇష్టం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన శ్రియ శరణ్ ని ఇప్పటికీ తెలుగు ఆడియన్స్ ఇష్ట పడుతూనే ఉన్నారు అందుకే హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి 22 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ఆమెకు అవకాశాలు వచ్చేలా చేస్తున్నారు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా స్టార్స్ అందరితో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్న శ్రియ ఫాం కోల్పోయాం కదా అని సినిమాలకు దూరం కాకుండా వచ్చిన అవకాశాలను చేసుకుంటూ వచ్చింది. ఇక మ్యారేజ్ తర్వాత మరింత కంఫర్ట్ జోన్ లోకి వెళ్లిన శ్రియ సినిమాల పరంగా తనకు వచ్చిన పాత్రలను చేస్తూ అలరిస్తుంది. ఆస్కార్ గెలిచిన ఆర్.ఆర్.ఆర్ సినిమాలో కూడ శ్రియ చిన్న పాత్ర లో మెప్పించింది. రెండు దశాబ్దాల క్రితం హీరోయిన్ గా పరిచయమైన శ్రియ అందంలో ఇప్పటి హీరోయిన్స్ ఏమాత్రం తగ్గకుండా అందాల ప్రదర్శన చేస్తుంది. ఈ మధ్య సినిమాల్లో ఆమెకు గ్లామర్ షోకి ఛాన్స్ దొరక్కపోవడంతో ఫోటో షూట్స్ తో తన గ్లామర్ తో ప్రేక్షకుల కళ్లు జిగేలుమనిపించేలా



చేస్తుంది అమ్మడు. ఇక శ్రియ లేటెస్ట్ ఫోటో షూట్ చూస్తే 40 ఏళ్ల వయసు మీద పడ్డా అందం విషయంలో పదహారణాల పడుచు పిల్లలా కనిపిస్తుంది. శ్రియ లేటెస్ట్ ఫోటోస్ చూసిన వారంతా అమ్మడు అందం తినేస్తుందా ఏంటి అని కామెంట్స్ చేస్తున్నారు. ఇక శ్రియ సినిమాల విషయానికి వస్తే దృశ్యం 2 తో హిందీలో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న శ్రియ కబ్జాలో హీరోయిన్ గా నటించింది. ఇక త్వరలో మ్యూజిక్ స్కూల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. శ్రియ సినిమాల కన్నా ఆమె ఫోటో షూట్స్ తో చేసే గ్లామర్ షోనే ఎక్కువ వార్తల్లో నిలుస్తుంది. ఇప్పటికీ సోలో హీరోయిన్ గా అవకాశం ఇస్తే అందంతో అదరగొట్టేసేలా ఉంది అమ్మడు. ఏది ఏమైనా రెండు దశాబ్దాల తర్వాత ఒక కూతురికి తల్లయ్యాక కూడా శ్రియ చేస్తున్న ఈ మెయింటెనెన్స్ చూసి మిగతా హీరోయిన్స్ షాక్ అవుతున్నారు.



# ప్రియాంక చేతుల మీదుగా తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో రిలీజ్..

హైదరాబాద్ : కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ తెలంగాణలో పర్యటించబోతున్నారు. ఈ నెల 8న సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే 'యువ సంఘర్షణ' సభలో ప్రియాంక పాల్గొనబోతున్నారు. ఈ పర్యటనకు సంబంధించి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పూర్తి వివరాలు మీడియాకు వెల్లడించారు. ప్రియాంక పర్యటనలో భాగంగా తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రియాంక రిలీజ్ చేయనున్నట్లు రేవంత్ తెలిపారు. 'గతంలో వరంగల్ డిక్లరేషన్ పేరు మీద యువనేత రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ విడుదల చేశారు. అదే స్పూర్తితో హైదరాబాద్ డిక్లరేషన్‌ను సరూర్ నగర్ సభలో విడుదల చేస్తాం. విద్యార్థులు, నిరుద్యోగులు, అమరవీరుల కుటుంబాలను ఎలా ఆదుకుంటామో హైదరాబాద్ డిక్లరేషన్‌లో ప్రకటిస్తాం. టీఎస్పీఎస్సీని యూపీఎస్సీ తరహాలో నియమించి ఉద్యోగ నియామకాలు ఎలా చేపడతామో సభలో వివరిస్తాం. ప్రియాంక గాంధీ సభలో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తారు. ఉద్యోగాలు ఇవ్వండని కేసీఆర్‌ను అడగడం కాదు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊదరగొడితేనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది. అందుకే ఈ యువ సంఘర్షణ సభ నిర్వహిస్తున్నాం. ఈ సభకు పార్టీలకు అతీతంగా మద్దతుగా తరలి రావాలి. విద్యార్థి, నిరుద్యోగులందరూ సభను విజయవంతం చేయాలి. కేసీఆర్ విముక్త తెలంగాణ తీసుకొచ్చేందుకు సహకరించాలి' అని రేవంత్ రెడ్డి కోరారు.

**ఇలా చేస్తే గౌరవం తగ్గుతుంది..! :** కర్ణాటకలో ఎన్నికలు జరుగున్న నేపథ్యంలో బీజేపీ వర్సెస్ కాంగ్రెస్‌గా మాటల యుద్ధం, సవాళ్లు, ప్రతిసవాళ్లు జరుగుతున్నాయ్. ముఖ్యంగా బజరంగ్‌దళ్ విషయంలో కాంగ్రెస్‌కు ఒకరిద్దరు నేతలు చేసిన ప్రకటనతో దేశ వ్యాప్తంగా ఎక్కడిక్కడ బీజేపీ ధర్నాలు చేపడుతోంది. అదికాస్త తెలంగాణకు కూడా పాకింది. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలకు తెలంగాణ బీజేపీ పిలుపునిచ్చింది. దీంతో హైదరాబాద్‌లోని గాంధీ భవన్ ఎదుట హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ, నిరసన తెలిపారు. ఇవాళ ఉదయం నుంచి తెలంగాణలో బీజేపీ వర్సెస్ కాంగ్రెస్‌గా పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై తాజాగా రేవంత్ రెడ్డి స్పందించారు. 'కర్ణాటకలో ఓడిపోతామన్న భయంతోనే బీజేపీ మా పార్టీ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడుతోంది. ఈ రకమైన పోకడలు తెలంగాణ రాజకీయ సంస్కృతి మంచిదా..?. బండి సంజయ్, కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నా.. ఇలాంటి చర్యలతో మీ గౌరవం తగ్గుతుందే.. తప్ప పెరగదు' అని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.



# జూన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అమరవీరుల స్మారకం ప్రారంభం

హైదరాబాద్ : ఈ ఏడాది జూన్ నెలలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా తెలంగాణ అమరవీరుల స్మారకం ప్రారంభోత్సవం కానుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వెల్లడించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు హుస్సేన్ సాగర్ ఒడ్డున రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం నిర్మాణ పనులను శుక్రవారం మంత్రి పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణమంతా కలియ తిరుగుతూ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రధాన ద్వారం, ల్యాండ్ స్కేప్ ఏరియా, పార్కింగ్ ఏరియా, తెలంగాణ తల్లి విగ్రహం, ఫౌంటైన్ ఏరియా, గ్రానైట్ ఫ్లోరింగ్, ఫోటో గ్యాలరీ, ఆడియో, విజువల్ రూం, లిఫ్టులు, ఎస్కలేటర్, కన్వెన్షన్ సెంటర్, పై అంతస్థులో రెస్టారెంట్, నిరంతరం జ్వలించే జ్యోతి ఆకృతి ఇలా అన్ని రకాల పనులను మంత్రి ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఆదేశానుసారం అధికారులకు, నిర్మాణ సంస్థకు పలు సూచనలు చేశారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలు ప్రతిబింబించేలా.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ నగరం నడిబొడ్డున హుస్సేన్ సాగర్ తీరాన ఈ నిర్మాణం చేపట్టారని ప్రశాంత్ రెడ్డి తెలిపారు. అరుదైన స్టెయిన్ స్టీల్‌తో అన్ని రకాల అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో, సకల హంగులతో స్మారకాన్ని నిర్మించామని తెలిపారు. ప్రపంచంలోనే అరుదైన స్టెయిన్ లెస్ స్టీల్‌తో నిర్మించిన అతిపెద్ద కట్టడం ఇదేనని వివరించారు. ఈ నిర్మాణం పూర్తి అయి అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రపంచమే అబ్బురపడి చూస్తుందన్నారు.

స్మారక ప్రాంగణానికి ఎవరు వచ్చినా అమరవీరుల త్యాగాలు గుర్తు చేసుకునే విధంగా ఈ నిర్మాణంలో ఏర్పాట్లు ఉండబోతున్నాయని తెలిపారు. ఇది పూర్తిగా యావత్ తెలంగాణ ప్రజల హృదయాలను హత్తుకునే కట్టడమని, ప్రతి ఒక్కరూ మనసుపెట్టి పనిచేయాలని అధికారులను, వర్క్ ఏజెన్సీని మంత్రి కోరారు. ల్యాండ్ స్కేప్ ఏరియాలో పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆహ్లాదకరమైన రంగురంగుల పూల మొక్కలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణ ఫినిషింగ్ పనుల్లో వేగం పెంచాలని, పర్ట్ చార్ట్ ప్రకారం పనులు పూర్తి చేసి కేసీఆర్ విధించిన నిర్ణీత గడువులోగా ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అందుకు తగ్గట్టుగా మ్యాన్ పవర్ పెంచాలని సూచించారు. మంత్రి వెంట ఆర్ అండ్ బీ అధికారులు, కేపీసీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఆర్కిటెక్ట్, తదితరులు ఉన్నారు.

# గవర్ననెన్స్‌లో కూడా ఇన్నోవేషన్ రావాలి.. అప్పుడే దేశం ముందుకు వెళ్తుంది : మంత్రి కేటీఆర్

వరంగల్ : కేవలం యువతలోనే కాకుండా, గవర్ననెన్స్‌లో కూడా ఇన్నోవేషన్ రావాలి.. అప్పుడే దేశం ముందుకు వెళ్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. వరంగల్ కిట్స్ కాలేజీలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులను ఉద్దేశించి కేటీఆర్ ప్రసంగించారు. యువత అందరూ త్రీ ఐ సూత్రాన్ని పాటించాలని సూచించారు. త్రీ ఐ అంటే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నోవేషన్, ఇంక్లూజివ్ గ్రోత్ అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలనేది ఒకప్పటి తరం ఆలోచన. ఒక వేళ ఉద్యోగం దొరక్కపోతే ప్రయివేటు ఉద్యోగం సంపాదించాలి. రిటైర్‌మెంట్ నాటికి ఇల్లుకట్టుకోవాలి. పిల్లల వివాహాలు చేయాలనేది ఒకప్పటి తరం ఆలోచన అని కేటీఆర్ పేర్కొన్నారు.

**తరాలు మారే కొద్ది ఆలోచనలు మారుతాయి..** ఈ జనరేషన్ పిల్లలు అయితే ఏదో ఒక స్టార్టప్ రన్ చేస్తున్నారు. ఏదో ఒక పనిలో నిమగ్నమవుతున్నారు. ఎక్కడో ఒక చోట జాబ్ వస్తుంది. మొదటి, రెండో నెలలోనే కారు లేదా ఇల్లు కొంటారు. ఇది ఎందుకు చెప్తున్నాను అంటే తరాలు మారేకొద్ది ఆలోచనలు మారుతాయనడానికి ఈ విషయం చెబుతున్నాను. ఇప్పుడున్న యువతకు ధైర్యం ఏంటంటే.. నేను మంచి కాలేజీలో చదువుకుంటున్నాను. ఎక్కడైనా ఉద్యోగం వస్తుందనే ధీమాతో ఉంటున్నారు. ప్రపంచంతో పోటీ పడే ధైర్యం నాకుంది. ఒక ఉద్యోగం కాకపోతే ఇంకో ఉద్యోగం వస్తదనే స్కిల్‌తో నేటి యువత ఉన్నారు. ఆ ఆత్మవిశ్వాసంతోనే నేటి యువత ఇండ్లు, కార్లు కొంటున్నారు. మన పిల్లల్లో, మన సమాజంలో వచ్చిన మార్పు మన ప్రభుత్వాల్లో మాత్రం రాలేదు. ప్రభుత్వాలు ఇంకా మూస పద్ధతుల్లోనే పోతున్నాయి. అప్పు చేయొద్దు.. అప్పు చేసి పప్పు కూడు తినొద్దు అనే డైలాగులు వినిపిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

**మౌలిక సదుపాయాలు కల్పించాలి..** త్రీ ఐ సూత్రంలో భాగంగా మొదటగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కేటీఆర్ పేర్కొన్నారు. విదేశాలకు వెళ్లి ఇండియాకు తిరిగొచ్చే యువతకు తప్పకుండా ఈ ఆలోచనలు వస్తాయి. విదేశాల్లో హైవేలు, రోడ్లు ఎందుకు అభివృద్ధి చెందాయి. మన దగ్గర ఎందుకు అభివృద్ధి చెందలేదనే ఆలోచన వస్తుంది. అయితే మన దగ్గర ఆర్థిక సంస్కరణలు తేవాలనే ఆలోచన లేదు. మనం ఏం చేసినా ప్రపంచ స్థాయిలో ఆలోచన రావాలి తప్ప కిందిస్థాయిలో రావొద్దు. ఇన్నోవేషన్ అనేది కేవలం స్టార్టప్‌లకు మాత్రమే పరిమితమైంది కాదు. గవర్ననెన్స్‌లో కూడా ఇన్నోవేషన్ రావాలి. అప్పుడే దేశం ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నోవేషన్‌తో పాటు ఇంక్లూజివ్ గ్రోత్ కూడా రావాలి. ఒక హైదరాబాద్, బెంగళూరులోనే ఐటీ డెవలప్ అయితే లాభం లేదు. ద్వితీయ శ్రేణి నగరాలైన వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ వంటి జిల్లాల్లో కూడా ఐటీ డెవలప్ కావాలి. టాలెంట్ ఉంటే.. ఎక్కడి నుంచైనా పని చేయొచ్చు. అమ్మాయి, అబ్బాయి అనే తేడా లేకుండా, రూరల్, అర్బన్ ఇన్నోవేటర్ అని, కులం, మతం అనే తేడాలేకుండా



సమ్మిళితమైన అభివృద్ధి జరగాలి. మనకున్న బుర్రకు పదును పెట్టాలి అని కేటీఆర్ సూచించారు.

**నీళ్లు, భూమి దిక్కులేని జపాన్ ఎందుకు ఎదిగింది..? :** జపాన్ దేశంలో 15 శాతం మాత్రమే నివాసయోగ్యమైన భూమి ఉంది అని కేటీఆర్ గుర్తు చేశారు. మిగతా భూమి అంతా రాళ్లు, గుట్టలే. నివాసయోగ్యం కానిది. ఆటం బాంబు దాడికి గురైంది జపాన్. జపాన్‌లో ప్రకృతి వనరులు లేవు. తాగేందుకు కూడా నీళ్లు లేవు. పంటలు పండించేందుకు కూడా భూములు లేవు. సునామీలు, భూకంపాలు వస్తాయి. కానీ జపాన్ ఈరోజు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తి. మొదటిది అమెరికా, రెండోది చైనా, మూడోది జపాన్. జపాన్ జనాభా కేవలం 12 కోట్లు. మన జనాభానేమో 121 కోట్లు. వాళ్లకేమో సునామీ, భూకంపాలు వచ్చే. నీళ్లు దిక్కులేవు. భూమి దిక్కులేదు. బాంబు పడే. మరి జపాన్ మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎలా ఎదిగింది. జపాన్ వాళ్లు బుర్రను వాడారు. మనం బుర్ర వాడలేదు. అంతే తేడా అని కేటీఆర్ పేర్కొన్నారు.

**మన ప్రాధాన్యాలు వేరే కాబట్టే వెనుకబడి పోతున్నాం..** 1987లో చైనా, భారత్ జీడీపీ సేమ్. ఇవాళ వాళ్ల జీడీపీ 18 ట్రిలియన్ డాలర్లు.. మనదేమో 3.34 ట్రిలియన్ డాలర్లు అని కేటీఆర్ తెలిపారు. మన ప్రాధాన్యాలు వేరే అయ్యాయి కాబట్టి వెనుకబడి పోతున్నాం. ప్రపంచ స్థాయి ఉత్పత్తులపై మనం దృష్టి సారించలేదు. చైనానేమో ఇతర దేశాలతో పోటీ పెట్టుకుంది. ప్రపంచం గర్వపడే ఉత్పత్తులను చైనా తయారు చేస్తుంది. ఇండియానేమో పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ అని చెప్పి.. ఇక్కడే సచ్చినం. ఎందుకంటే భారతదేశంలో కొన్ని అవలక్షణాలు ఉన్నాయి. కులం, మతం గురించి మాట్లాడుతాం. ఇలాంటి వాటి మీద ఫోకస్ ఎక్కువైపోయింది. మంచినీళ్లు, కరెంట్ ఇవ్వాలన్న సోయి లేదు. రోడ్లు బాగు చేయాలన్న జ్ఞానం లేదు. అమెరికాతో పోటీ పడాలంటే.. తర్వాతి జనరేషన్ మారాలి. భారతదేశంలో సమూలమైన మార్పులు రావాలి. ఫోకస్ మారాలి. మనం పది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి. తెలంగాణ యువత కోసం హైదరాబాద్‌లో టీ హబ్, వీ హబ్, టీ వర్క్స్, రిచ్ వంటి సంస్థలు ఉన్నాయి. మీరు వచ్చి వాటిని వినియోగించుకోవాలి అని కేటీఆర్ సూచించారు.

# గౌతమ బుద్ధుని జ్ఞానమార్గం నేటి సమాజానికి ఎంతో అవసరం : సీఎం కేసీఆర్



హైదరాబాద్ : బుద్ధ పూర్ణిమ సందర్భంగా ప్రజలందరికీ ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. బుద్ధుని ఆశయాలకు కార్యరూపమిస్తూ ప్రభుత్వం ఘన నివాళులర్పిస్తోంది అని పేర్కొన్నారు. బుద్ధుని బోధనలు, కార్యాచరణను కేసీఆర్ స్మరించుకున్నారు. గౌతమ బుద్ధుని జ్ఞానమార్గం నేటి సమాజానికి ఎంతో అవసరం అని అన్నారు. తెలంగాణ గడ్డ మీద బౌద్ధం పరిఢవిల్లడం మనందరికీ గర్వకారణం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన బుద్ధవనం ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తోంది. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో జీవించేలా పాలన కొనసాగిస్తున్నామని కేసీఆర్ తెలిపారు.


# ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యుత్తమ వైద్య సేవలు : మంత్రి గంగుల



కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు పల్లె, బస్తీ దవాఖానాలు ఏర్పాటుచేసిందని రాష్ట్ర బీసీసంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లి గ్రామం 1వ డివిజన్ లో బస్తీ దవాఖాన, పల్లె దవాఖానాలను జిల్లా ప్రధాన ఆసుపత్రిలో జిల్లా మానసిక ఆరోగ్య చికిత్స కేంద్రాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా పక్కా ప్రణాళికతో ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుందని వెల్లడించారు. ఇందుకోసం ఆసుపత్రులు, వైద్య కళాశాలలను ప్రారంభించుకున్నామని తెలిపారు. కేసీఆర్ కిట్స్, న్యూట్రిషన్ కిట్స్, భాగ్యలక్ష్మి తదితర పథకాల వల్ల వివిధ ఆరోగ్య సూచీలో తెలంగాణ పురోగతిని సాధించిందన్నారు. ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువు చేసేలా 5వేల నుంచి 10వేల లోపు జనాభా గల నాన్ మెట్రో యూఎల్బీలలో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసిందన్నారు. కరోనా సమయంలో వైద్యులు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాలపై డాక్టర్లు ఎక్కువ శ్రద్ధను కనబరచాలని కోరారు. అంతకుముందు పల్లెదవాఖానాలో మంత్రి, జిల్లా పరిషత్ చైర్మన్ లు వైద్యపరీక్షలను చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్, జిల్లా పరిషత్ చైర్మన్ కనుమల్ల విజయ, నగర మేయర్ వై. సునీల్ రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, వైద్యాఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి, మున్సిపల్ కమిషనర్ సేవాఇస్లావత్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# భజరంగ్‌దళ్‌పై వ్యాఖ్యలు ఎంత వరకు సమంజసమో కాంగ్రెస్ చెప్పాలి

హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల మానిఫెస్టోలో భజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ ప్రకటించడంపై బీజేపీ నేత విజయశాంతి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. భజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రస్తావించడం ఎంత వరకూ సమంజసమో ఆ పార్టీ విశ్లేషించుకోవాలన్నారు. హిందువులు విశ్వసించే భావాలకు, నమ్మకాలకు వ్యతిరేక నిర్ణయాలను ప్రకటిస్తున్న కాంగ్రెస్‌ను మెజారిటీ ప్రజలు అనుమానించే పరిస్థితిని ఆ పార్టీయే స్వయంగా సృష్టించుకుంటోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన ఈ ప్రకటనను యుూపీఏ భాగస్వాములుగా ఉందామనుకుంటున్న ఎన్ని రాజకీయ పార్టీలు సమర్థిస్తాయో చెప్పాలని డిమాండ్ చేశారు. భజరంగ్‌దళ్‌పై నిషేధం, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ తీవ్ర విమర్శలు... ఇవన్నీ ఎంఐఎం వంటి పార్టీల అనుకూలత కోసమే అనే విషయాన్ని ప్రజల్లో ఆలోచన రేపుతోందన్నారు. నిజానికి ప్రజలలో



విభజన సృష్టించడమే బీజేపీ విధానమైతే... ఈ రోజు దేశమంతా ఆత్యధికంగా ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధుల రూపంలో పరిపాలనా బాధ్యతలలో ఉండదని విజయశాంతి పేర్కొన్నారు.

# కేటీఆర్‌తో పాటు ఆయన మినిస్ట్రీపై కేసు పెట్టిన షర్మిల

హైదరాబాద్ : మంత్రి కేటీఆర్‌తో పాటు ఆయన మినిస్ట్రీపై బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల కేసు పెట్టారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకుపై పూర్తి బాధ్యత కేటీఆర్‌దేనన్నారు. లక్షల మంది విద్యార్థుల జీవితాలు కేటీఆర్‌కి చిన్న విషయంగా కనిపిస్తున్నాయన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ పై కేటీఆర్‌ని విచారించాలన్నారు. కేసీఆర్ హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. నిరుద్యోగ దీక్షలు చేస్తే మంత్రులు అవమానించారన్నారు. అయినా దీక్షలు చేశామన్నారు.

విద్యార్థుల కోసం కొట్లాడుతుంటే ఆడబిడ్డ అని చూడకుండా తనను కూడా జైల్లో పెట్టారన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ సైట్ దర్యాప్తుపై నమ్మకం లేదన్నారు. పేపర్ లీకులతో విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారన్నారు. టీఎస్‌పీఎస్సీలో అంత ఈజీగా పేపర్ లీక్ ఎలా చేశారన్నారు.

**రాష్ట్రంలో అసలు భద్రత ఉందా? :** "టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ పూర్తిగా ఐటీ డిపార్ట్మెంట్ వైఫల్యం. కేటీఆర్ నాకేం సంబంధం. పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత కేటీఆర్‌దే. సిట్ దర్యాప్తు ప్రగతి భవన్ నుంచే



నడుస్తోంది. ఎవరిని విచారించాలి? ఎవరి పేర్లు చేర్చాలి అనేది ప్రగతి భవన్ డైరెక్షన్ నుంచే నడుస్తోంది.

ఐటీ శాఖ బాధ్యత వహించకపోతే ఎవరు బాధ్యత వహిస్తారు? రాష్ట్రంలో ప్రతి సిస్టంకి ఐటీ శాఖనే బాధ్యత వహించాలి. టీఎస్‌పీఎస్సీలో ఉన్న సిస్టమ్స్‌కి ఆడిట్ సర్టిఫికెట్స్ ఉన్నాయా? టీఎస్‌పీఎస్సీ సిస్టమ్స్ మళ్ళీ హ్యాక్ జరగదని గ్యారెంటీ ఏంటి?" అని షర్మిల అన్నారు.

# సంపూర్ణ ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా వైద్య సేవలు : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ




గోల్నాక (హైదరాబాద్): సంపూర్ణ ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం పలు వైద్య సేవలను ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ వెల్లడించారు. శుక్రవారం అంబర్‌పేట పటేల్‌నగర్ కమ్యూనిటీ హాల్లో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో వసతులతో పాటు కంటి పరీక్షల నిర్వహణను అక్కడున్న వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కంటి వెలుగు, బస్తీ దవాఖానాలు, టీ డయాగ్నిస్టిక్స్ కేంద్రాలు, మెడికల్ కాలేజీలు, కొత్త దవఖానాల ఏర్పాటుతో వైద్య సేవలు ప్రజల ముంగిటకు తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అంధత్వ నివారణ కోసం సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. వంద రోజులు పాటు కొనసాగుతున్న ఈ శిబిరాల్లో ఇప్పటికే కంటి సమస్యతో బాధపడే అనేక మంది సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వీణ, ప్రవీణ్, ఆశావర్కర్లు బుగ్గమ్మ, సంతోషి, సిరిన్, మాలతి, అనిత, బీఆర్ఎస్ నాయకులు అమనూరి సతీశ్, మహేశ్‌ముదిరాజ్, అతిక్, నర్సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీభవన్ వద్ద ఉద్రిక్త వాతావరణం.. భారీగా పోలీస్ బలగాల మోహరింపు

హైదరాబాద్: గాంధీభవన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గాంధీభవన్ ముందు భారీగా పోలీసు బలగాలు మోహరించారు. కర్ణాటక ఎన్నికల మానిఫెస్టోలో భజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ ప్రకటించడంపై బజరంగ్‌దళ్ సభ్యులు భగ్గుమంటున్నారు. ఈరోజు గాంధీభవన్ ఎదుట హనుమాన్ చాలీసా చదవాలని పిలుపునివ్వడంతో ఉత్కంఠ నెలకొంది. దాంతో ముందస్తుగా భారీగా పోలీసులు మోహరించారు. గాంధీభవన్‌కు రెండు వైపుల ఉన్న గేట్లను బారికేడ్లతో మూసివేశారు. గాంధీభవన్‌లో వరుస సమావేశాల నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే హాజరుకానున్నారు.

ఈ నేపథ్యంలో బజరంగ్‌దళ్ కార్యకర్తలు నిరసన తెలిపేందుకు వస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. గాంధీభవన్ ముందు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. గాంధీభవన్ లోపలికీ ఎవరినీ అనుమతి ఇవ్వకపోవడంతో పోలీసులతో కాంగ్రెస్ పార్టీ నేతలు వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు వారిని లోనికి అనుమతించారు. కర్ణాటక ఎన్నికల మానిఫెస్టోలో భజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ ప్రకటించడంపై బజరంగ్‌దళ్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దఎత్తున దేశ వ్యాప్తంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు బజరంగ్‌దళ్, బీజేపీ పిలుపునిచ్చింది. అందులో భాగంగా బజరంగ్ దళ్ నేతలు, కార్యకర్తలు గాంధీభవన్‌కు రానున్నారు. ఈ క్రమంలో గాంధీభవన్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com